ప్రజాశక్తి

బుధవారం 28 ఫిబ్రవరి 2024 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

వైసిపి సైన్యం తాడేపల్లికి..

- ప్రతి నియోజకవర్గం నుంచి 20 మందికి పైగా హాజరు
- ఎన్నికలకు సిద్ధంపైనే సిఎం జగన్ దిశానిర్దేశం

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

నియోజకవర్గ సమన్వయకర్తలతో పాటు మండలస్థాయి కన్వీనర్లు.. జగనన్న సైన్యం పేరుతో ఏర్పాటైన ముఖ్యులు, బూతుస్థాయి కన్వీనర్లకు నేతృత్వం వహించే నేతలు ఇలా ప్రతి నియోజకవర్గం నుంచి 20 మంది వరకూ వైసిపి నేతలు తాడేపల్లికి వెళ్లారు. సిఎం జగన్ నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశానికి హాజరయ్యారు. వైసిపి శ్రేణులకు ఎన్నికలపై శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మేము సిద్ధం పేరుతో జరుగుతున్న ఎన్నికల సమరానికి సన్నద్ధం చేస్తున్నారు. పోల్ మేనేజ్‌మెంటుపై రాష్ట్ర స్థాయి సమావేశం మంగళవారం నాడు విజయవాడలో జరిగింది. దీనికి అన్ని నియోజకవర్గ ఇన్‌ఛార్జిలతో పాటు ఎంపిక చేసిన నేతలు వెళ్లారు. అన్ని నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలుగా ఉన్న నేతలు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఇద్దరు మంత్రులు ఆదిమూలపు సురేష్, మేరుగ నాగార్జున, మాజీ మంత్రి బాలినేనితో పాటు కొత్తగా నియమితులైన సమన్వయకర్తలు అందరూ వెళ్లారు. అంతా ఎన్నికల వ్యూహంపైనే చర్చ సాగింది. బూతుస్థాయిలో ఎలా వ్యవహరించాలనే దానిపైనే దిశానిర్దేశం చేశారు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సాగిన ఈ సమావేశంలో కీలకమైన సమయాల్లో ఎలా ఉండాలన్న దానిపైనే ప్రధాన ఎజెండాగా చర్చ సాగింది. ఈ నెల 3న అద్దంకిలో జరుగుతున్న సిద్ధం బహిరంగ సభపైనా జిల్లాల నేతలతో పార్టీ ముఖ్యనేతలు భేటీలు నిర్వహించారు. జన సమీకరణ, ఇతర ఏర్పాట్లపై చర్చించారు.

ఇళ్లస్థలాలకు రిజిస్ట్రేషన్ కష్టాలు

సర్వర్ రాక, వివోఆర్ఒలు అందుబాటులో లేక లబ్ధిదారుల పడిగాపులు

8లో

ఒంగోలు కార్పొరేషన్ దివాళా..!

- కార్మికులకు జీతాలు కూడా చెల్లించలేని పరిస్థితి
- కమీషన్ల కోసం జీతాల డబ్బులు కాంట్రాక్టర్లకు చెల్లించిన అధికారులు
- ప్రస్తుతం కార్పొరేషన్ జనరల్ ఫండ్ అకౌంట్‌లో అందుబాటులో ఉన్న నిధులు రూ.98 లక్షలే..
- శాలరీ అకౌంట్‌లో మిగిల్చింది రూ.కోటి మాత్రమే..
- 7 నెలలుగా విద్యుత్తు బిల్లులు కూడా చెల్లించని వైనం

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగరపాలక సంస్థ ఆర్థిక పరిస్థితి దివాళా తీసింది. సంవత్సరానికి దాదాపు రూ.191 కోట్ల బడ్జెట్ కలిగిన కార్పొరేషన్‌లో ప్రస్తుతం జనరల్ ఫండ్ కేవలం రూ.98 లక్షలు మాత్రమే అందుబాటులో ఉంది. కార్మికులకు జీతాలు కూడా చెల్లించలేని స్థితికి కార్పొరేషన్ ఆర్థిక పరిస్థితి దిగజారింది. కార్పొరేషన్ ఆప్కాస్ కార్మికులకు గత నెల, ఈ నెల జీతాలు కూడా చెల్లించడానికి గల్లా పెట్టెలో డబ్బులు లేవని తెలియడంతో కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు గడిచిన ఏడు నెలలుగా విద్యుత్తుశాఖకు కార్పొరేషన్ నుంచి చెల్లించాల్సిన కరెంటు బిల్లులు దాదాపు రూ.9 కోట్ల బకాయిలు కూడా నిధులు లేని కారణంగా నిలిచిపోయాయి. దీంతో పేరు గొప్ప, ఊరు దిబ్బ అన్నట్లు ఒంగోలు కార్పొరేషన్ పరిస్థితి తయారైంది.

కమిషన్‌లకు కక్కుర్తి పడి.!

కార్పొరేషన్‌కు పన్నుల రూపంలో వచ్చే ఆదాయంలో ముందుగా మున్సిపల్ కార్మికుల జీతాలకు ఖర్చు చేయాలి. తరువాతనే కరెంటు బిల్లులు, కాంట్రాక్టర్‌ల బిల్లులు చెల్లించాలి. అయితే అదేమీ ఆలోచించకుండా నెల రోజుల కిందట గత కమిషనర్ వెంకటేశ్వరరావు కార్పొరేషన్ ఖజానాలో ఉన్న జనరల్ ఫండ్ డబ్బులన్నీ కాంట్రాక్టర్ల బిల్లులకు చెల్లించారు. మూడు నెలలకు సరిపడా కార్మికులకు జీతాలు చెల్లించేందుకు అవసరమైన నిధులు అందుబాటులో ఉంచిన తరువాతనే ఇతర బిల్లులకు ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉండగా నిబంధనలు పాటించకుండా కాంట్రాక్టర్లకు చెల్లింపులు చేశారు. దీంతో ఇప్పుడు కార్మికులకు జీతాలు కూడా చెల్లించలేని పరిస్థితి నెలకొంది. కేవలం కాంట్రాక్టర్లు ఇచ్చే కమిషన్‌లకు కక్కుర్తి పడి అకౌంట్స్ విభాగం అధికారులు, కార్పొరేషన్ ఉన్నతాధికారులు కార్మికుల జీతాల డబ్బులను కూడా కాంట్రాక్టర్లకు చెల్లించారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

రెండు నెలల జీతాల మాటేమిటో..

గత కమిషనర్ వెంకటేశ్వరరావు జనవరి మాసం చివరిలో బదిలీ అయ్యారు. కొత్త కమిషనర్ జస్వంతరావు ఫిబ్రవరి ఒకటో తేదీన బాధ్యతలు స్వీకరించారు. కమిషనర్‌ల బదిలీల నేపథ్యంలో కార్మికుల జీతాల ▶ 2లో

ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్‌పి వకుల్‌జిందాల్

సిఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

8లో

బాలికల కిడ్నాప్‌కు యత్నం

- సమయస్ఫూర్తితో తప్పించుకున్న విద్యార్థినులు

నిందితులు ప్రయాణించిన కారు ఇదే..

ప్రజాశక్తి-కురిచేడు

గుర్తుతెలియని వ్యక్తులు ముగ్గురు బాలికలను కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించిన ఘటన కురిచేడు మండలం, బోధనంపాడులో మంగళవారం కలకలం లేపింది. అలవలపాడు గ్రామానికి చెందిన కూరేటి వెంకటరమణ, కూరేటి హర్షిణి, కొరివి అపర్ణ బోధనంపాడు ప్రభుత్వ హైస్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్నారు. తమ గ్రామం నుండి నడకమార్గాన హైస్కూల్‌కి వచ్చి తరగతులు ముగించుకొని తిరిగి తమ గ్రామానికి నడిచి వెళ్తున్నారు. దర్శి నుండి కురిచేడు వైపు వెళుతున్న కారు వారి వద్దకు వచ్చి ఆగింది. ఆ విద్యార్థినులను కారులో వ్యక్తులు ఎక్కాలని అందులోని వ్యక్తులు అడిగారు. బాలికలు తిరస్కరించడంతో అందులో ఒక విద్యార్థినిని కారులో ఉన్న వారు లాగే ప్రయత్నం చేయబోగా సమయస్ఫూర్తితో తప్పించుకొని ముగ్గురూ పరుగుపరుగున తిరిగి తమ పాఠశాల వద్దకు వెళ్లారు. జరిగిన విషయాన్ని ఉపాధ్యాయులకు, స్థానికులకు తెలిపారు. వారు వెంటనే ద్విచక్ర వాహనాలపై అలవలపాడు రోడ్డు వరకు పోయి చూడగా అప్పటికే గుర్తుతెలియని వ్యక్తులు పరారయ్యారు. ఘటనపై స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు విచారణ చేస్తున్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

సిఎస్‌పురం: స్థానిక కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయంలో పదో తరగతి చదువుతున్న బాలిక అదశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.ప్రేమ్‌కుమార్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. సిఎస్‌పురం గ్రామానికి చెందిన యాసం నిఖిల స్థానిక కేజీబీవీలో పదోతరగతి చదువుతోంది. నిఖిలకు జ్వరంగా ఉండటంతో ఈ నెల 22న సాయంత్రం ఆ పాఠశాలలో పనిచేస్తున్న రఫియా బాలికను ఇంటి దగర తల్లిదండ్రులకు అప్పజెప్పింది. తల్లి బాలికకు వైద్యశాలలో చికిత్స చేయించి.. పదోతరగతి పరీక్షలు సమీపిస్తున్నాయనే ఉద్దేశంతో మరుసటి రోజు పాఠశాల వద్ద మళ్లీ విడిచి పెట్టి వచ్చింది. 24న సాయంత్రం ఐదున్నర గంటల ప్రాంతంలో నిఖిల చేతికి ఉన్న క్యానల్‌ను ▶ 2లో

వైసిపిలో భగ్గుమన్న గ్రూపు విభేదాలు

- ఓ సర్పంచ్ పేరు లేకుండా శిలాఫలకాలు ఏర్పాటు
- వాటిని సుత్తితో పగలగొట్టిన రేగుమానుపల్లి సర్పంచి

శిలాఫలకాలను సుత్తితో పగలగొడుతున్న రేగుమానుపల్లి సర్పంచి

ప్రజాశక్తి-పెద్దారవీడు

మండలంలో సచివాలయం ప్రారంభోత్సవం సందర్భంగా వైసిపిలోని గ్రూపు విభేదాలు బట్టబయలయ్యాయి. శిలాఫలకంపై తన పేరులేకపోవడంతో రేగుమానుపల్లి సర్పంచి పాలగిరి రామాంజనేయరెడ్డి శిలాఫలకాన్ని సుత్తితో ధ్వంసం చేశారు.

మండలంలోని చట్లమిట్లలో చట్లమిట్ల పంచాయతీ, రేగుమానుపల్లి పంచాయతీలకు ఉమ్మడిగా నూతన సచివాలయాన్ని, ఆర్‌బికెను నిర్మించారు. నిర్మాణం పూర్తయ్యింది. సచివాలయం, ఆర్‌బికె ప్రారంభం సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకంలో వైసిపికి చెందిన చట్లమిట్ల సర్పంచి అల్లూరమ్మ పేరు ఉంది. కానీ అధికార పార్టీకే చెందిన రేగుమానుపల్లి సర్పంచి పాలగిరి రామాంజనేయరెడ్డి పేరు లేదు. చట్లమిట్ల సర్పంచి గ్రూపునకు, రామాంజనేయరెడ్డి గ్రూపునకు గతంలోనూ విభేదాలున్నాయి. ఈ నేపథ్యంలో శిలాఫలకంపై రామాంజనేయరెడ్డి పేరు లేదు. తన పంచాయతీకి కూడా సంబంధించిన సచివాలయం ప్రారంభోత్సవ శిలాఫలకంపై తన పేరు లేకపోవడంతో రామాంజనేయరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. వాళ్లు పట్టించుకోలేదు. దీంతో తీవ్ర ఆవేదనకు గురైన ఆయన సచివాలయం, రైతు భరోసా కేంద్రాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన శిలఫలాలను ఆయన సుత్తితో పగలకొట్టారు. దీంతో మండలంలో వైసిపిలోని గ్రూపు విభేదాలు మరోసారి బట్టబయలయ్యాయి. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదూ అందలేదని పోలీసులు తెలిపారు.

ఎమ్మెల్యేగా విజయ్‌కుమార్‌ను గెలిపించుకోవాలి

టిడిపి నేతల ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు ఆధ్వర్యంలో మండలంలోని గుమ్మళంపాడు గ్రామంలో మంగళవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ (సూపర్ సిక్స్ పథకాలు) కార్యక్రమంలో భాగంగా మండల తెలుగుదేశం పార్టీ మహిళా టీం ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. యువతకు ఉపాధి అవకాశాలు, స్కూళ్లకు వెళ్లే ప్రతి విద్యార్థికి తల్లికి వందనం, ప్రతి ఏటా రైతుకు ఆర్థిక సాయం, ప్రతి ఇంటికి ఉచితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, ప్రతి స్త్రీకి నెలకు పదిహేను వందల రూపాయలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తదితర పథకాలను వివరించారు. నియోజకవర్గ అభ్యర్థి బిఎన్ విజయ్ కుమార్‌ను ఎమ్మెల్యేగా, నారా చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని, ప్రతి మహిళ అదే సంకల్పంగా పనిచేయాలని మహిళా కమిటీ కోరింది. ఈ కార్యక్రమంలో మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు నార్నె మాధవీలత, బాపట్ల పార్లమెంట్ మహిళ సోషల్ మీడియా కోఆర్డినేటర్ నాదెండ్ల సాహితి, బొడ్డపాటి శ్రీదేవి, మండల తెలుగు మహిళ ఉపాధ్యక్షురాలు పులగర మేరమ్మ, బొడ్డపాటి సుందరమ్మ, నెప్పలి అనిత, బొడ్డపాటి లక్ష్మి, నువ్వుల రాజేశ్వరి, నెప్పలి తులసమ్మ, బొడ్డపాటి అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

చెరుకుపల్లి : బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమానికి కార్యకర్తలు స్వచ్ఛందంగా అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు. గత నెల రోజులుగా చెరుకుపల్లి మండలంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం విజయవంతంగా సాగుతోంది. అన్ని గ్రామాలలో అధిక సంఖ్యలో కార్యకర్తలు స్వచ్ఛందంగా పాల్గొని ఇంటింటికీ తిరిగి ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. మంగళవారం మండల పరిధిలోని గుల్లపల్లిలో మూడోరోజు సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. భవిష్యత్తులో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల గురించి ఓటర్లకు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి పిట్టు శ్రీనివాసరెడ్డి, ఎంఆర్‌కె మూర్తి, ఉప్పాల సాంబశివరావు, వంగర చక్రవర్తి, కందుల వెంకటేశ్వరరావు, నాగుల పున్నారావు, సీతయ్య, వెంకటేశ్వరరావు, సుధాకర్, రత్తయ్య పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య శాఖ గ్రీవెన్స్‌కు 16 అర్జీలు

ప్రజాశక్తి-బాపట్ల

ఆరోగ్య శాఖ ఉద్యోగుల సమస్యలపై అర్జీలు అందజేసేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎస్ విజయమ్మ గ్రీవెన్స్ (స్పందన) కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రీవెన్స్‌లో సర్వీస్ మేటర్లకు సంబంధించిన 16 అర్జీలు, ఆర్థిక సంబంధిత అర్జీలు 4 వచ్చాయని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి విజయమ్మ తెలిపారు. అర్జీలను పరిశీలించి సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని అన్నారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారి, పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు.

ఒంగోలు కార్పొరేషన్ దివాళా.!

(మొదటిపేజీ తరువాయి)

సంగతి పట్టించుకోలేదు. దీంతో గత నెలలో ఆప్కాస్ కార్మికులకు జీతాల చెల్లింపులు నిలిచిపోయాయి. రెండు మాసాల జీతాలు ఈ నెలలో చెల్లిస్తారని కార్మికులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇప్పుడు జీతాలు చెల్లించేందుకు అసలు కార్పొరేషన్‌లో డబ్బులే లేవని తెలిసి కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆప్కాస్‌లో మొత్తం 916 మంది కార్మికులు ఉన్నారు. వీరికి నెలకు రూ.1.56 కోట్లు జీతాలు చెల్లించాలి. ప్రతి నెలా 23వ తేదీకి ఆన్‌లైన్‌లో ఆప్కాస్‌కు జీతాల బిల్లు బదలాయిస్తే ఒకటో తేదీన ఆప్కాస్ నుంచి కార్మికుల అకౌంట్‌లకు జీతాలు జమవుతాయి. గత నెలలో కమిషనర్ల బదిలీల వల్ల జీతాలు ఆగినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ నెల చివరికి వచ్చినా ఇప్పటివరకు ఆప్కాస్‌కు జీతాల బిల్లు బదిలీ కాలేదు. ఇందుకు కారణం కార్పొరేషన్ శాలరీ అకౌంట్‌లో సరిపడా నిధులు అందుబాటులో లేకపోవడమేనని స్పష్టమవుతోంది. గత నెల, ఈ నెల.. రెండు నెలల జీతాలు కార్మికులకు రూ.3.12 కోట్లు చెల్లించాల్సి ఉండగా శాలరీ అకౌంట్‌లో కేవలం రూ.కోటి నిధులు మాత్రమే అందుబాటులో ఉన్నట్లు సమాచారం. దీంతో ఆ నిధులు ఆప్కాస్‌కు బదలాయించలేదని తెలిసింది.

ఆర్థిక సంఘం నిధులు అందుబాటులో ఉన్నా.!

కార్పొరేషన్ అకౌంట్లను మూడు పద్దులుగా విభజించి ప్రస్తుతం లావాదేవీలు జరుపుతున్నారు. అందులో శాలరీ అకౌంట్, జనరల్ ఫండ్ అకౌంట్, 15వ ఆర్థిక సంఘం అకౌంట్. ఇందులో శాలరీ అకౌంట్‌లో సుమారు రూ.కోటి. జనరల్ ఫండ్ అకౌంట్‌లో రూ.98 లక్షలు, 15వ ఆర్థిక సంఘం అకౌంట్‌లో రూ.26 కోట్ల నిధులు అందుబాటులో ఉన్నాయి. ఆర్థిక సంఘం నిధులు అందుబాటులో ఉన్నా ఆ నిధులు జీతాలకు మరల్చేందుకు నిబంధనలు అంగీకరించవు. ఆ నిధులు కేవలం అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి జరిగిన పనులకు మాత్రమే చెల్లింపులు చేయాల్సి ఉంది. దీంతో ఆప్కాస్ కార్మికుల రెండు నెలల జీతాలు, ఏడు నెలలుగా కరెంటు బిల్లుల బకాయిలు ఎలా చెల్లించాలో అర్థంకాక కార్పొరేషన్ అధికారులు తల పట్టుకుంటున్నారు.

బాలికల కిడ్నాప్‌కు యత్నం

(మొదటిపేజీ తరువాయి)

తీసివేయడం కోసం పిఈటి ఉపాధ్యాయురాలు రఫియా డాక్టర్ దగ్గరికి తీసుకురాగా ఏదైనా తినిపించాలని తీసుకురావాలని డాక్టర్ చెప్పాడు. దీంతో రఫియా నిఖిలను వాళ్ల ఇంటి దగ్గర వదిలి.. వెళ్లిపోయింది. తల్లిదండ్రులు ఇంటి వద్ద లేకపోవడంతో తమ అమ్మమ్మ వాళ్ల ఇంటికి వెళ్లానని స్థానికులకు నిఖిల చెప్పి వెళ్లింది. అప్పటి నుంచి నిఖిల కానరావడం లేదు. ఎంత వెతికినా నిఖిల కనిపించకపోవడంతో తల్లి లక్ష్మీరాజ్యం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నేతలు

ఓపీఎస్‌ను పునరుద్ధరించే వారికే ఓటు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

పాత పెన్షన్ స్కీం (ఓపీఎస్)ను పునరుద్ధరించే వారికే వచ్చే ఎన్నికల్లో ఓటు వేయాలని, రాష్ట్రంలో సీపీఎస్, జీపీఎస్ తెచ్చిన వారిని ఓడించాలని యూటీఎఫ్ నేతలు పిలుపునిచ్చారు. యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో యర్రగొండపాలెంలో మంగళవారం ఓట్ ఫర్ ఓపీఎస్ పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బి బాబులు నాయక్ మాట్లాడుతూ ఓపీఎస్‌పై రాజకీయ పార్టీలు తమ వైఖరిని స్పష్టం చేయాలని, అధికారంలోకొచ్చాక మొదటి సంతకంగా ఓపీఎస్‌ను అమలు చేయాలని తెలిపారు. సీపీఎస్, జీపీఎస్ తెచ్చిన వారిని ఓడించేందుకు సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్‌వి నాయక్, కె దుర్గా ప్రసాద్, నాయకులు శ్యాంరాజు, ఆడిపి నాగయ్య, సుగ్రీవ్ మస్తాన్‌రావు, పి రవి కుమార్, రంగ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం గెలుపు అత్యవసరం

- 3వ డివిజన్‌లో 'జనం కోసం జనార్ధన్'

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఇంటింటి ప్రచారంలో జనార్ధన్

రానున్న ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ అత్యవసరమని, పార్టీని ప్రజలు ఆదరించాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు తెలిపారు. జనం కోసం జనార్ధన్, బాబు షురిటీ భవిష్యత్తుకి గ్యారెంటీ కార్యక్రమం మంగళవారం ఒంగోలు నగరంలోని 3వ డివిజన్ లోని ఎన్టీఆర్ కాలనీ, బలరాం కాలనీ, భరత్ కాలనీలో నిర్వహించారు. కార్యక్రమం లో భాగంగా టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఒంగోలు మాజీ శాసనసభ్యులు దామచర్ల జనార్ధన రావు ఇంటింటికి వెళ్లి మహిళలు, యువతతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. .డివిజన్ లో మినీ మేనిఫెస్టో కరపత్రాలను అందజేసి తెదేపా అధికారంలోకి వస్తే అమలు చేయబోయే సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ చంద్రబాబు ఒక విజన్ ఉన్న నాయకుడని..రాష్ట్ర భవిష్యత్తు బాగుండాలంటే చంద్రబాబు మళ్లీ సిఎం కావాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో తెదేపా గెలుపు అత్యవసరమని, పార్టీ గెలుపుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమం లో మంత్రి శ్రీనివాసరావు, కొరారి నాగేశ్వరావు, కామేపల్లి శ్రీనివాసరావు, బండారు మదన్, 3వ డివిజన్ అధ్యక్షులు పఠాన్ మహమ్మద్ ఖాన్, డొక్కా శ్రీను, కొక్కిలగడ్డ సముద్రాలు, కోమటినేని పద్మావతి, షేక్ అభిషేక్, షేక్ కరీముల్లా, కొక్కిలగడ్డ లక్ష్మి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సౌకర్యాల ఏర్పాటుకు సహకరించండి

ప్రజాశక్తి-పర్చూరు

పర్చూరు నియోజకవర్గంలో రాబోయే ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ కేంద్రాలలో సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నామని, అందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు అందరూ సహకరించాలని ఈఆర్ఒ వెంకటేశ్వర్లు కోరారు. స్థానిక తహశీల్దారు కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా ఫైనల్ పబ్లికేషన్ తర్వాత వచ్చిన క్లెయిములను ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు మాత్రమే చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో పర్చూరు తహశీల్దారు సిహెచ్ సుబ్బయ్య, ఇంకొల్లు తహసీల్దారు ఎం ప్రమీల, చిన్నగంజాం తహసీల్దారు జివిఎస్ ఫణీంద్రబాబు, కాంగ్రెస్ నాయకులు తోట శివ, టీడీపీ నాయకులు ఎస్‌కె శంషుద్దీన్, రంగయ్య చౌదరి, వైసిపి నాయకులు లంక శివ, బీజేపీ నాయకులు ఎ కృష్ణ పాల్గొన్నారు.

విధి నిర్వహణలో శ్రద్ధగా ఉండాలి

ప్రజాశక్తి-భట్టిప్రోలు

మండలంలోని వైలవరం గ్రామంలో అమృతలూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో భట్టిప్రోలు సెక్టార్ పరిధిలోగల ఐలవరం ఎస్సీ ఎస్టీ ఏరియాలో మంగళవారం సెక్టార్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా అమర్తలూరు ప్రాజెక్ట్ సిడిపిఒ విజయలక్ష్మి పాల్గొన్నారు. అంగన్‌వాడీలు విధి నిర్వహణలో క్రమశిక్షణ పాటించి రికార్డులు సక్రమంగా నమోదు చేసుకోవాలని, హాజరు శాతం పౌష్టికాహారం పంపిణీ వంటి పలు రకాల కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించాలని అన్నారు. అలాగే కేంద్రాలను సమయానికి తెరిపించి సమయపాలన పాటించాలని, చిన్నారులకు ఆట పాటలతో కూడిన విద్యతోపాటు, మూడు సంవత్సరాలు నిండిన వారికి అక్షరాభ్యాసం కూడా చేయించి వారిలో అక్షరాలను గుర్తించే విధంగా అవగాహన కల్పించాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏసిడీపీఒ, సూపర్‌వైజర్ రమణ అంగన్‌వాడీలు ఉన్నారు.

CHANGE OF NAME

I, SYED BAJI SHARIEF
S/o. GALIB SHARIEF
Resident of H.No.3-179, Nayanipalli, Vetapalem Mandal,Bapatla,Andhra Pradesh.
I have changed my name form
SYED BAJI SHARIEF to
SYED BAJI SHARIF S/o.GALIB SHARIF
Hence forth i will be know as
SYED BAJI SHARIF S/o.GALIB SHARIF
will be applicable for all purpose

CHANGE OF NAME & DOB

I, **P CHANDRAMMAL** is legally Mother of No: **15332660W**, Rank: **L/HAV**, Name: **NEMILAIAH PULICHINTHALA,** Unit: 2 ENGR REGT C/O 56APO, resident of Atchampeta Village & Post, Racherla Thesil & Mandal, Prakasam District - 523372, Andhra Pradesh. have changed my Name from
P CHANDRAMMAL to
PULICHINTHALA CHANDRAMMA
and Date of Birth from **01-07-1953 to 01-01-1938**
As per affidavit dated 26-02-2024 before public Notary,Giddalur.

పబ్లిక్ నోటీసు

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా ఒంగోలు వాస్తవ్యులు శృంగవరపు ఆంజనేయులు గారి భార్య పద్మావతి ఇచ్చిన మేర ఈ పబ్లిక్ పబ్లిక్ నోటీసు ఇవ్వడమైనది తేది 07-02-2024న నా క్లయింట్ ఆటోలో ఒంగోలు రాంనగర్ 7వలైన్ నుండి బ్యాంకు కు వెళ్ళుచుండగా ఈ క్రింద పలకరించబడిన సంతకములతో కూడిన చెక్కులు మరియు చెక్కు పుస్తకములు జారిపడిపోయినవి సదరు చెక్కులు ఎవరికైననూ దొరికినట్లయితే ఈ క్రింది అడ్రస్ కు అందజేయగలరు
1) SBI,SME Branch Ongole A/c 31712346702,IFSC SBIN0004246, సంబంధించిన సంతకములతో చెక్కు నెంబర్లు, 647076,647077,647078.
2) పంగులూరి అనూష గారికి సంతకములతో కూడిన చెక్కు0000006,A/C NO.50100434691273,IFSC NO HDFC 0000317, Hyderabad.
3) శ్రీ ప్రసన్నాంజనేయం గ్రానైట్స్ ప్రైవేట్ లిమిటెడ్ అకౌంట్ కు సంబంధించి సంతకములతో కూడిన చెక్కునెంబర్లు,22255,22256,22258,22259,22260,22261,22262, మరియు చెక్కుబుక్ 22263 నుండి 22350 నెంబర్ల కూడినవి SBI ఓవర్సీస్ బ్రాంచ్ విశాఖపట్నం A/C 42486585437, IFSC SBIN 0008974.

ఇట్లు
మొలకలపల్లి అజయ్‌బాబు
అడ్వకేట్, Ex GP.
రాజాపానగల్‌రోడ్డు, ఒంగోలు
సెల్ : 9866896439

మహారాజశ్రీ శ్రీయుత 8 వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి వారి కోర్టు ఒంగోలు
EP No : 654/2022
In
A.O.P No : 803/2019
Between
M/S శ్రీరామ్ ట్రాన్స్ పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ (లిమిటెడ్) చీరాల బ్రాంచ్ రిప్రజెంటెడ్ బై జి.పి.ఏ హోల్డర్ వై.గోపీచంద్ ....D.H.R
వర్సెస్
కోమట్ల వెంకటేశ్వరరెడ్డి మరియు మరొకరు ..జెడిఆర్
To
కోమట్ల వెంకటేశ్వరరెడ్డి,తండ్రి అక్కిరెడ్డి, వయస్సు 37 సం, నివాసం : ఈస్ట్ SC స్ట్రీట్ బొప్పేపల్లి గ్రామం, మార్టూరు మండలం, ప్రకాశం జిల్లా (ప్రస్తుతం బాపట్ల జిల్లా)
నోటీసు
పై నెంబర్ EPని డిక్రి హోల్డర్ జె.డి.ఆర్ పై ఆర్బిటల్ అవార్డు బాకీ వసులు నిమిత్తం కొరకు EP దాఖలు చేసి ఉన్నారు దరిమిల పై నెంబర్ EPలో ఒకటవ జేడీఆర్ కి సమన్లు ఎన్నిసార్లు పంపించిననూ వారు వేరు కారణం చేత తీసుకోనందున శ్రీయుత కోర్టు వారు పేపర్ ప్రకటన ద్వారా జేడీఆర్ కు ఈపి సమన్లు జారి నిమిత్తం ఉత్తర్వులు జారీ చేసినారి కావున పై తెలిపిన శ్రీయుత కోర్టు వారి ఎదుట తేదీ 15-03-2024 న ఉదయం 10.30.ని.లకు స్వయంగా గాని లేదా న్యాయవాది ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది
// కోర్టు వారి ఉత్తర్వులు మేరకు //
ఇట్లు
కొత్తగొర్ల వెంకటేశ్వర్లు
అడ్వకేట్, మురళి ప్లాజా,
జిల్లా కోర్టు ఎదురు ఒంగోలు
సెల్ : 9441441969

మహారాజశ్రీ ఒంగోలు ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
IA No : 752/2022
In
OS No : 885/2021
Between
పరాల సుబ్బారావు ... పిటిషనర్ /వాది
వర్సెస్
కోటా కోటి శంకరరావు .... రెస్పాండెంట్ /ప్రతివాది
To
కోటా కోటి శంకరరావు, తండ్రి కోటయ్య నివాసం : హౌస్ నెం.31-53-27, ఆర్టీసీ కాలనీ, సత్యనారాయణపురం,ఒంగోలునగరం ,ప్రకాశంజిల్లా.
నోటీసు
పై నెంబర్ పిటిషన్‌ను పిటిషనర్/ వాది రెస్పాండెంట్/ప్రతివాది పై ప్రామిసరీ నోటు బాకీ వసూలు నిమిత్తం కోరకు దావా దాఖలు చేసి ఉన్నారు దరిమిల పై నెంబర్ పిటిషన్ దాఖలు చేసి ఉన్నారు కావున కోర్టు వారి ఉత్తర్వుల మేరకు రెస్పాండెంట్ కి సమన్లు పంపించినను కావాలని తీసుకోకపోవడం చేత శ్రీ కోర్టు వారు పేపర్ నోటీస్ కు ఆర్డర్ వేసి ఉన్నారు తేది 14-03-2024 న ఉదయం 10 గంటలకు మీరు స్వయంగా గాని లేదా న్యాయవాది ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియజేసుకునవలెను లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలుసుకోవలేది
// కోర్టు వారి ఉత్తరం మేరకు //
ఇట్లు
కొత్తగొర్ల వెంకటేశ్వర్లు
అడ్వకేట్,
మురళిప్లాజా జిల్లాకోర్టు ఎదురు,
ఒంగోలు
సెల్ : 9441441969

పేదలకు ఆహారం అందజేత

ఆహారం ప్యాకెట్లు అందజేస్తున్న పి.ఆర్ ఇఇ కోటేశ్వరరావు

ప్రజాశక్తి-టంగుటూరు

నిరుపేదలు, అనాధలకు అందజేసే సహాయ ప్రతిఫలం తిరిగి మనకు మరింతగా ఉపకరిస్తుందని పంచాయతీరాజ్ కందుకూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, టంగుటూరు మండలం అనంత వరం నివాసి యరమాల కోటేశ్వరరావు తెలిపారు. కోటేశ్వరరావు తండ్రి యరమాల వీర రాఘవులు 21వ వర్ధంతి మంగళ వారం నిర్వహించారు. ఈ సందర్భంగా అనాధలు, వద్ధులు, యాచకులకు కోటేశ్వరరావు, కుటుంబ సభ్యుల చేతుల మీదుగా ఆహారం ప్యాకెట్లు, వాటర్ బాటిల్స్‌ను టంగుటూరు యూత్ హెల్పింగ్ ఆర్గనైజేషన్ సభ్యుల ఆధ్వర్యంలో యాచకులకు అందజేశారు.ఈ కార్యక్ర మంలో యరమాల వెంకటేశ్వర్లు, వెంకటరమణమ్మ, మాధవి, ఏకా ప్రభాకర రావు వైహెచ్ఒ కమిటీ సభ్యులు దేవరపల్లి చంద్రశేఖర్, చాటగడ్డ అనిల్, పొదిలి శశి కుమార్, వీరమల్లి అజయ్, కొమ్ము చినబాబు, జి.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఓటు ఫర్ ఓపిఎస్ పుస్తకావిష్కరణ

పుస్తకావిష్కరణలో యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి- సిఎస్ పురంరూరల్

వైసిపి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను మరచి ఉద్యోగులను వంచించిందని యుటిఎఫ్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జె.వెంకట్రావు, షేక్ బాదుషా తెలిపారు. మండల పరిధిలోని సినాగులవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓట్ ఫర్ ఓపిఎస్ (మన ఓటు మన భవిష్యత్) అనే పుస్తకాన్ని మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాను అధికారంలోకి వస్తే వారం రోజుల లో ఒపిఎస్ ను రద్దు చేస్తానని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చినట్లు తెలిపారు. అయినప్పటికీ ఇప్పటి వరకూ ఒపిఎస్‌ను రద్దు చేయలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు ఎం.కుమారి, యుటిఎఫ్ నాయకులు హెచ్. వీరాంజనేయులు, బివిఎస్. రమేష్, ఎం.శ్రీనివాసులు, ఎస్.రామకష్ణ, రియాజ్ బాషా, షేక్ నాయబ్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరణ

పిసిపల్లి : మందకష్ణ మాదిగ ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి జిల్లాల పర్యటనలో భాగంగా మార్చి 2న అద్దంకిలో నిర్వహిస్తున్న ఉమ్మడి ప్రకాశం జిల్లా సదస్సును జయప్రదం చేయాలని ఎంపిఆర్‌పిఎస్ కనిగిరి నియోజక వర్గ ఇన్‌ఛార్జి నేలపాటి రాజుమాదిగ కోరారు. సదస్సు సంబంధించిన కరపత్రాలను పిసిపల్లి మండల ఇన్‌ఛార్జి నందిపాటి సుధీర్ మాదిగ ఆధ్వర్యంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ బాలసాని మోహన్, ఎబినేజరు, పూండ్ల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియోపై శిక్షణ

శింగరాయకొండ : శింగరాయకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మార్చి 3న నిర్వహిస్తున్న పల్స్ పోలియోపై ఆశాలు, అంగన్‌వాడీలకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చైతన్య కష్ణ డాక్టర్ వంశీధర్ మాట్లాడుతూ శింగరాయకొండ మండలంలో 4,639 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాల్సి ఉందన్నారు. మూడు రోజుల పాటు నూరు శాతం చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిడిఒ డాక్టర్ శ్రీధర్, సి హెచ్ ఒ దోగిపర్తి వెంకట సాంబశివరావు , కునాపారెడ్డి రాజమ్మ, సంపూర్ణమ్మ పిహెచ్ఎన్ ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

5న మండల సమావేశం

దర్శి : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఈనెల 5న నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ హనుమంతరావు తెలిపారు. ఎంపిపి సుధారాణి అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మండల పరిధిలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు సకాలంలో సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

పాఠశాలలో నీటి సరఫరా ప్రారంభం

చీమకుర్తి : మండల పరిధిలోని పాటిమీదపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నీటి సరఫరా ట్యాపులను ఎంఇఒ వెంకటేశ్వర్లు, శివాజీ, స్కూలు కాంప్లెక్స్ చైర్మన్ కాంతారావు మంగళవారం ప్రారంభించారు. పాఠశాల వార్షిక తనిఖీ సందర్భంగా వాటర్ ట్యాపులు ప్రారంభించారు. అనంతరం పాఠశాల రికార్డులు పరిశీలించారు. మధ్యాహ్నభోజనాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ కాంతారావు, ప్రధానోపాధ్యాయుడు ఎస్‌కె.శిలార్, ఉపాధ్యాయులు విజయ సంజీవి,వాకా కవిత, సిఆర్‌పిలు జయరావు, మాలకొండయ్య, కొండలు వెంకటరావు, విక్టోరియా రాణి, రామసుబ్బయ్య, ప్రసాదు, ప్రవీణ్ పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా కిరణ్

మార్కాపురం రూరల్ : మార్కాపురం మున్సిపల్ కమిషనర్ గా కిరణ్ నియమిస్తూ కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. రెండు నెలల క్రితం మార్కాపురం కమిషనర్‌గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన రవీంద్రా ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్‌కు అసిస్టెంట్ కమిషనర్ గా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో మార్కాపురం పురపాలక సంఘం కమిషనర్ గా కిరణ్‌ను నియమించారు.

తెరుచుకోని ఆరోగ్య కేంద్రాలు

ప్రజాశక్తి-వెలిగండ్ల

వైఎస్ఆర్ ఆరోగ్య కేంద్రాలు ఆశించిన ఫలితాలు ఇవ్వడం లేదు. మండలంలో ఏడు వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 12 రకాల వైద్య సేవలు, 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహించాలి. పి.నాగులవరం, కంకణంపాడు, ఇమ్మడిచెరువు, రాళ్లపల్లి గ్రామాల్లోని వైఎస్ఆర్ ఆరోగ్య కేంద్రాలకు మంగళవారం తలుపులు తీయలేదు. వైద్యసేవల కోసం అక్కడి వచ్చిన రోగులు నిరాశతో వెనుదిరిగారు. ఉన్నతాధికారులు స్పందించి వైఎస్ఆర్ ఆరోగ్య కేంద్రాలు సక్రమంగా పనిచేసేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

తాళం తీయని ఇమ్మడిచెరువు హెల్త్ సెంటర్

విశ్రాంత ఉపాధ్యాయుడు వెంకటయ్యకు నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-దర్శి

దర్శికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు సందు వెంకటయ్య ఇటీవల యాత్రలకు వెళ్లి బీహార్‌లోని రాంచీ పట్టణంలో గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని స్వగ్రామమైన దర్శికి మంగళవారం తీసుకొచ్చారు. దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, గరికపాటి గోపి, ఎపిటిఎఫ్ నాయకులు జనార్ధన్‌రెడ్డి, కృష్ణ, చౌడిరెడ్డి, వి.రాఘవరావు, సిపిఎం నాయకులు తాండవ రంగారావు, సందు వెంకటేశ్వరరావు, కర్ణా నారాయణ, యుటిఎఫ్ నాయకులు ధనిరెడ్డి వెంకటరెడ్డి, మీనిగ శ్రీను, భాస్కర్‌రెడ్డి తదితరులు సందు వెంకటయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

కుటుంబ జీవనానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -కనిగిరి

ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యంతో ఏడాదిగా ఇంటికే పరిమితమైన కనిగిరి పట్టణానికి చెందిన చిన్ని నారాయణకు డాక్టర్ ఎస్.సుబ్బారెడ్డి, ఇస్కాన్ సభ్యుడు గుత్తి శ్రీధర్ రూ.25 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. నారాయణ కుటుంబ సభ్యులకు జీవనోపాధికి, టిఫిన్ బండి, ఇతర సామగ్రి కలిపి రూ.25 వేల ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాన్ని ఆదుకోవడం తమకెంతో ఆనందాన్ని ఇస్తుందన్నారు. నారాయణ కుటుంబం అభివృద్ధి అన్ని విధాల సహాయ పడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవతా సంస్థ చైర్మన్ సోమిశెట్టి శ్రీనివాసులు , కన్వీనర్ మాంటిసోరి పిచ్చిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ పసుపులేటి అరుణోదర్, మదర్ సేవాసమితి అధ్యక్షుడు ఎస్ఎన్ .రసూల్ ,కోశాధికారి వాగిచర్ల వెంకటేశ్వర్లు, సెక్రటరీ ఉమాకాంత, బాబూరావు, డైరెక్టర్స్ పచ్చవ చంద్రశేఖర్, చెంచులు,తాళ్లూరు వెంకటేశ్వర్లు, బొట్లు శీను పాల్గొన్నారు.

టిఫిన్‌బండి, ఆర్థిక సాయం అందజేస్తున్న దాతలు

ఇద్దరు బిడ్డలతో సహా తల్లి అదృశ్యం

ప్రజాశక్తి-కొమరోలు

ఇద్దరు బిడ్డలతో సహా తల్లి అదృశ్యమైన ఘటన ఆలస్యం వెలుగు చూసింది. వివాహిత బంధువుల కథనం ప్రకారం... మండల పరిధిలోని ముత్రాసు పల్లి గ్రామానికి చెందిన పందిళ్ల లక్ష్మీదేవి అనే వివాహిత కుటుంబ కలహాల నేపథ్యంలో ఈనెల 24 తమ పిల్లలు వెంకటరమణ (5, విష్ణు ప్రియ(9) తీసుకొని ఇంటి నుంచి వచ్చింది. లక్ష్మీదేవి, పిల్లల ఆచూకీ కోసం బంధువులు చుట్టు ప్రక్కల గ్రామాల్లో గాలించారు. అయినప్పటికీ వారి ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో లక్ష్మీదేవి జి. రమణయ్య స్థానిక పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కంభం రూరల్

గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని జంగంగుంట్ల గ్రామ సమీపంలోని అమరావతి-అనంతపురం జాతీయ రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం... కంభం మండలం సైదాపురం గ్రామానికి చెందిన కొట్టె రాఘవేంద్ర (45)బైకుపై వెళ్తుండగా అదే సమయంలో గుర్తుతెలియని వాహనం బైకును ఢీకొంది. దీంతో రాఘవేంద్ర అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం కంభం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న కంభం ఎస్ఐ పులి రాజేష్ తెలిపారు.

అట్రాసిటీ కేసుపై విచారణ

ప్రజాశక్తి-మద్దిపాడు

ఎస్‌సి,ఎస్‌టి అట్రాసిటీ కేసుపై డిఎస్‌పి కిషోర్ మంగళవారం విచారణ చేపట్టారు. మద్దిపాడు మండలం వెంకటరాజు పాలెంలో ట్రోవగుంటకు చెందిన ముగ్గురు మహిళలు ఎండు పొగాకు ఏరుకొని వస్తున్న సమయంలో హత్యాయత్నం చేయడానికి ప్రయత్నించిన ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్‌సి,ఎస్‌టి అట్రాసిటీ కేసు చేశారు. అందులో భాగంగా ఈ డిఎస్‌పి బాధిత మహిళలను విచారించారు.

ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-కొమరోలు

కారు, బైకు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని దద్దవాడ వద్ద మంగళవారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. గిద్దలూరు నుంచి గుంటూరు వెళ తున్న కారు పూసలపాడు నుంచి గిద్దలూరు వస్తున్న బైకు ఢీకొంది. దీంతో పూసలపాడు చెందిన శ్రీనివాసులు, శివారెడ్డి గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నివాళులర్పిస్తున్న నాయకులు

నాయబ్ రసూల్‌కు నివాళి

ప్రజాశక్తి-సిఎస్‌పురం

మండలంలోని చెన్నపునాయునిపల్లి గ్రామానికి చెందిన షేక్ నాయాబ్‌రసూల్ (30) గుండెపోటుతో సోమవారం రాత్రి చనిపోయాడు. ఆయన మృతదేహాన్ని ఎంపిపి మూడమంచు వెంకటేశ్వర్లు, మాజీ ఎంపిపి తోడేటి పెదఅల్లూరయ్య, సర్పంచి యనమల పెద్దసుబ్బయ్య, మాజీ సర్పంచులు చిట్టిబోయిన వెంకటేశ్వర్లు, గొర్రెల సహకార సంఘం జిల్లా వైస్ ప్రెసిడెంట్ తోడేటి గోపి తదితరులు సందర్శించి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

తప్పులు సవరిస్తున్నాం: ఆర్‌డిఒ

ఓటరు జాబితాలో

ప్రజాశక్తి-రేపల్లె

ఓటరు జాబితాలో నెలకొన్న తప్పులను సవరించేందుకు చర్యలు తీసుకున్నామని రేపల్లె ఆర్డీవో హెలాషారోన్ తెలిపారు. రేపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె తన కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. 80 ఏళ్ల నిండిన వృద్ధులు, దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తామన్నారు. 18 ఏళ్ల నిండిన యువతీ యువకులకు ఓటుహక్కు కల్పించేలా కళాశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఓటరు జాబితాలో తప్పులపై పార్టీల ప్రతినిధులు ఆమె దృష్టికి తేగా, బీఎల్వోలు క్షేత్రస్థాయిలో పర్యటించి తప్పులను సరిచేస్తున్నారని సమాధానమిచ్చారు. రేపల్లె నియోజకవర్గంలో అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వెబ్ కాస్టింగ్, పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకుడు మణిలాల్ ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి ప్రతినిధి ధర్మతేజ, కేసన జగదీష్, ఎం సురేష్, అధికారులు నాగరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ షారోన్

'ఉపాధి హామీ' పనులు ప్రారంభం

ప్రజాశక్తి-భట్టిప్రోలు

భట్టిప్రోలు విరలేశ్వర్ నగర్‌లోని దేవస్థానం భూమి లో మంగళవారం ఇంకుడు గుంట నిర్మాణం చేపట్టేందుకు గ్రామ సర్పంచ్ దారా రవికిరణ్మయి చేతుల మీదుగా పనులు ప్రారంభించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా చేపట్టిన కూలీలకు ఉపాధి లభించడమే కాక భూగర్భ జలాలు నిల్వ ఉండటానికి దోహద పడుతుందని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మల్లికార్జునరావు, పాలకవర్గ సభ్యులు కట్ట మల్లేశ్వరి నాగరాజు, టెక్నికల్ అసిస్టెంట్ సుధీర్, నాయకులు చెన్నయ్య ఉపాధి హామీ చట్టం సిబ్బంది ఉన్నారు.

ఇంకుడు గుంట పనులు చేపడుతున్న అధికారులు

గోడ ప్రతులను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా

పోలియోను సమూలంగా నిర్మూలించాలి

ప్రజాశక్తి-బాపట్ల

జిల్లాలో పోలియోను సమూలంగా నిర్మూలించేందుకు వైద్యాధికారి ప్రత్యేక చర్యలు చేపట్టాలని బాపట్ల జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా అన్నారు. మార్చి 3న ఆదివారం జాతీయ పల్స్ పోలియో దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లా పల్స్ పోలియో టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన క్యాంప్ కార్యాలయంలో నిర్వహించారు. వైద్య ఆరోగ్య శాఖ, ఇతర శాఖల సమన్వయంతో పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా పల్స్‌పోలియో గోడప్రతులను జిల్లా కలెక్టరు ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి ఎస్ విజయమ్మ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి వెంకటేశ్వర్లు, జిల్లా పంచాయతీ అధికారి, డిఆర్‌డిఏ పిడి, ఐసిడిఎస్, ఎస్ఈ విద్యుత్, పిడి మెప్మా, డిఈఒ, ఏపీఎస్ఆర్టీసీ ప్రాంతీయ అధికారి, ఇతర టాస్క్‌ఫోర్స్ సభ్యులు పాల్గొన్నారు.

బాపట్ల మున్సిపల్ కమిషనర్‌గా బొజ్జా శ్రీకాంత్

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల మున్సిపల్ నూతన కమిషనర్‌గా బొజ్జా శ్రీకాంత్‌ను నియమిస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరు మున్సిపల్ కమిషనరుగా ఉన్న శ్రీకాంత్ బాపట్ల మున్సిపల్ కమిషనరుగా బదిలీపై వచ్చారు. ఇటీవల జరిగిన బదిలీల్లో బాపట్ల మున్సిపల్ కమిషనరుగా వచ్చిన కె రామచంద్రారెడ్డి కేవలం 27 రోజులు మాత్రమే ఇక్కడ కమిషనరుగా పనిచేశారు. బదిలీల్లో భాగంగా ఆయన ఆదోని మున్సిపల్ కమిషనరుగా వెళ్లారు.

ఓటు హక్కుపై యువతకు అవగాహన కల్పిస్తున్న ఔత్సాహికులు

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుది ప్రముఖ పాత్ర

ప్రజాశక్తి-రేపల్లె

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రముఖపాత్ర పోషిస్తుందని విజ్ఞాన్ ఒకేషనల్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ సాజిద్‌పాషా తెలిపారు. రేపల్లె పట్టణంలోని విజ్ఞాన్ ఒకేషనల్ కళాశాలలో మంగళవారం ఓటు హక్కుపై యువతకు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సాజిద్ పాషా మాట్లాడుతూ ఓటు అమ్ముల్యమైనదని, నగదు, మద్యం, ప్రలోభాలకు లొంగకుండా ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని అన్నారు. అప్పుడే నిజాయితీ, సామర్థ్యం గల నాయకులను ఎన్నుకుంటామని అన్నారు. అహమ్మదీయ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ సెక్రెటరీ సయ్యద్ తాహెర్ అహ్మద్ మాట్లాడుతూ 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని చెప్పారు. యువత తప్పనిసరిగా ఓటు వేయాల ని కోరారు. అందరూ కులమతాలకు అతీతంగా ఓటు వేయాలని సూచించారు. మెరుగైన సమాజం, దేశ భవిష్యత్తు కోసం అందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా విద్యార్థులు అవగాహన కల్పించాలని కోరారు. అందరూ ఓటు హక్కు వినియోగించుకున్నప్పుడే రాష్ట్రం, దేశాన్ని అభివృద్ధి చేయగల నాయకులను ఎన్నుకోగలుగుతామని అన్నారు. యువత బాధ్యతగా ఓటు హక్కు వినియోగించుకుని, ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడాలని అన్నారు. విద్యావంతులు ప్రజలకు ఓటు విలువను తెలియజేసి ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచేవిధంగా కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఆనందబాబును అభినందిస్తున్న టిడిపి వేమూరు నియోజకవర్గం శ్రేణులు

ఆనందబాబుకు నాయకుల అభినందనలు

ప్రజాశక్తి-వేమూరు: వేమూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా నాలుగో విడత మాజీ మంత్రి టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబును నియమించడం పట్ల నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున మంగళవారం ఆనందబాబును దుశ్శాలువతో సత్కరించి అభినందించారు. వేమూరు నియోజకవర్గంలో త్వరలో జరగనున్న ఎన్నికల్లో మరోమారు తెలుగుదేశం పార్టీ జెండాను ఎగురవేసేందుకు నియోజకవర్గ ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని నాయకులు పేర్కొన్నారు. నియోజకవర్గ పునర్విభజన అనంతరం ఇప్పటికే రెండుసార్లు నియోజకవర్గంలో పోటీచేసి గెలుపొంది ఒక విడత మంత్రి పదవి కూడా చేపట్టి నియోజకవర్గంలోనే కాక రాష్ట్రవ్యాప్తంగా దళితులకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజల మన్ననలు పొందారని నాయకులు కొనియాడారు. ఈ సందర్భంగా ఆనందబాబు మాట్లాడుతూ నియోజకవర్గంలోనే కాక రాష్ట్రవ్యాప్తంగా రానున్న ఎన్నికల్లో వైసిపి అరాచక పాలనకు చరమగీతం పాడి తెలుగుదేశం జనసేన పార్టీల ఆధ్వర్యంలో రాష్ట్రంలో అధికారం చేపట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వేమూరు నియోజకవర్గంలోని ఆయా మండలాల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

అవార్డు అందుకుంటున్న డిఎల్‌పిఒ తాతా శివశంకరరావు

డిఎల్‌పిఒ తాతా శివశంకరరావుకు..

జగనన్న స్వచ్ఛ సంకల్పం అవార్డు

ప్రజాశక్తి-చెరుకుపల్లి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో ఉత్తమ పనితీరు కనబరిచిన అధికారులకు ఐటిసి వారి ఆధ్వర్యంలో మంగళవారం అవార్డుల ప్రదానం జరిగింది. గుంటూరులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామీణ ఘన వ్యర్థాల నిర్వహణ కార్యక్రమంలో భాగంగా జగనన్న స్వచ్ఛ సంకల్పం ద్వారా బాపట్ల డిఎల్పిఒ ఉత్తమ అధికారిగా అవార్డు అందుకున్నారు. డివిజనల్ స్థాయిలో అన్ని మండలాల అధికారులతో, సిబ్బంది కార్మికుల చేత సమన్వయంతో కృషి చేసి అద్భుతంగా పనితీరు కనబరిచిన డిఎల్‌పిఒ తాతా శివశంకరరావు అవార్డు అందుకున్నారు. అదేవిధంగా చెరుకుపల్లి మండల పరిధిలో పొన్నపల్లి పంచాయతీ కార్యదర్శి ఎం జానకి రామయ్య, చెరుకుపల్లి పంచాయతీకి చెందిన కొత్త నాంచారయ్య ఉత్తమ హరిత రాయబారిగా అవార్డులు అందుకున్నారు. అవార్డులు అందుకున్న వారిని మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు అభినందించారు.

ఆరోగ్య సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-బాపట్ల

ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ ప్రక్రియ సత్వరమే పూర్తి చేయాలని ప్రభుత్వ వైద్య ఆరోగ్య ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కూరపాటి సత్యంరాజు అన్నారు. మంగళవారం వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల సమస్యలపై ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని పురస్కరించుకొని వైద్య ఆరోగ్య శాఖలో పనిచేసే ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి ఎస్ విజయమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్యంరాజు మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో పనిచేసే ఉద్యోగులు, వైద్యాధికారులు, ఆశాలు, ఏఎన్ఎంలు, స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, హెల్త్ అసిస్టెంట్లు, ఎంఎన్ఓ, ఎఫ్ఎన్ఓలకు సంబంధించిన శాఖాపరమైన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరుతూ జిల్లా వైద్య ఆరోగ్య అధికారికి వినపత్రం అందజేశామన్నారు. కాంట్రాక్టు సిబ్బందికి నూరు శాతం మూల వేతనం అమలు చేయాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బడుగు శివాజీ మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు వెంటనే పెంచాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎడ్ల శ్రీనివాసరావు, శ్యామల, వైద్య ఆరోగ్య ఉద్యోగులు పాల్గొన్నారు.

జిల్లా అధికారికి వినతిపత్రం అందిస్తున్న సిబ్బంది

తిరునాళ్లకు వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించండి

ప్రజాశక్తి-రేపల్లె

మండలంలోని అరవపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ బాల కోటేశ్వర స్వామి మహాశివరాత్రి తిరునాళ్ల మార్చి 8,9,10 తేదీలలో జరిగే తిరుణాలను జయప్రదం చేయాలని రేపల్లె మండల తహశీల్దారు చొప్ప రవీంద్రబాబు అన్నారు. మంగళవారం బాల కోటేశ్వర స్వామి ఆలయంలో అన్ని శాఖల అధికారులతో రెండవ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తహశీల్దారు చొప్ప రవీంద్రబాబు మాట్లాడుతూ తిరునాళ్ల సందర్భంగా వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా దేవాలయాల వద్ద భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు. మూడు రోజులపాటు గ్రామంలో మద్యం విక్రయాన్ని నిషేధించాలని పారిశుధ్యం మెరుగుపరచాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్డీఏ అధికారి ప్రసన్నకుమారి, దేవస్థానం ఈవో రాజేశ్వరరావు ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి, యుపిఆర్‌డి మల్లికార్జునరావు, ఇన్‌స్పెక్టర్ కుమార్, ఆర్టీసీ డిఎం జాన్ సుందరం, ఎంపీడీవో మల్లికార్జునరావు, గ్రామ సర్పంచ్ లోయ బాబు నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ విజయసారథి బదిలీ

ప్రజాశక్తి-చీరాల

చీరాల మున్సిపల్ కార్యాలయంలో ప్రస్తుత గ్రేడ్-1 కమిషనరుగా పనిచేస్తున్న బి విజయ సారథి మంగళవారం బదిలీ అయ్యారు. ఆయన స్థానం లో పార్వతీపురంలో మునిసిపల్ కమిషనరుగా విధులు నిర్వహి స్తున్న పి సింహా చలం చీరాలకు మునిసిపల్ కమిషనరుగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా బి విజయ సారథికి మునిసిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వార్డు సభ్యులు, ఛైర్ పర్సన్, మునిసిపల్ కౌన్సిలర్ల ఆధ్వర్యంలో కౌన్సిల్ హాల్‌లో వీడ్కోలు సభ ఘనంగా నిర్వహించి సత్కరించారు. ఈ సందర్భంగా ఛైర్ పర్సన్ జంజనం శ్రీనివాసరావు, డిఈ ఐసయ్య, పలువురు మాట్లాడుతూ కమిషనర్ బి విజయ సారథి సేవలను కొనియాడారు. ఎలక్షన్ అనంతరం తిరిగి చీరాల మునిసిపల్ కమిషనరుగా రావాలని ఆకాంక్షిస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా అటెండరు స్థాయి నుంచి బిల్లు కలెక్టరు వరకు దాదాపు 40 సంవత్సరాలు మునిసిపాలిటీకి ఎన్నో సేవలు అందిస్తూ విధులు నిర్వహిస్తున్న వార్డు అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీ టి చెన్నయ్య రిటైర్డ్ అయిన సందర్భంగా ఆయనను కూడా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌డోర్, అవుట్ డోర్ సిబ్బంది పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

కమిషనర్ పార్థసారథిని సత్కరిస్తున్న చైర్మన్ శ్రీనివాసరావు

'వరికపూడిశెల'ను నిర్మించాలి

- ప్రాజెక్టు సాధన సమితి డిమాండ్
- నేడు అవగాహన సదస్సు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మాణం కోసం రైతులు 40 ఏళ్లుగా ఎదురు చూస్తూనే ఉన్నారు. ప్రభుత్వాలు మారుతున్నాయి. నేతలు మారుతున్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి ఎవరూ ముందుకు రాలేదు. గతేడాది నవంబర్ 15న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మాచర్లలో వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ప్రాజెక్టు నిర్మాణానికి రూ. 3,500 కోట్లు అవసరమని తేల్చారు. మొదట విడతగా రూ. 1,600 కోట్లు కేటాయిస్తామన్నారు. అయినప్పటికీ ఇప్పటికీ పనులు ప్రారంభించలేదు. ఈ ప్రభుత్వ పుణ్యకాలం తొందర్లోనే ముగియనుంది. ఈ నేపథ్యంలో వరికపూడిశెల ప్రాజెక్టు సాధన సమితి ఆధ్వర్యంలో మండల కేంద్రమైన పుల్లలచెరువులో ప్రాజెక్టు ఆవశ్యకతపై బుధవారం రైతులకు అవగాహ సదస్సు నిర్వహించనున్నారు. ముఖ్య అతిథులుగా వరికపూడిశెల ప్రాజెక్టు సాధన సమితి అధ్యక్షుడు రమణయ్య, ప్రధాన కార్యదర్శి భుక్య రామాంజి నాయక్, పల్నాడు శ్రీను, అనంతరామిరెడ్డి, సిపిఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వర ప్రసాద్, రైతు సంఘం నాయకులు ఉవలవలపూడి రాము, సిపిఎం పల్నాడు జిల్లా కమిటీ సభ్యుడు కె. హనుమంతరెడ్డి పాల్గొననున్నారు.

వరికపూడిశెల ప్రాజెక్టు

వరికపూడిశెల ప్రాజెక్టు ఆవశ్యకత..

ఈ ప్రాజెక్టు కోసం యర్రగొండపాలెం, పుల్లలచెరువు, వెల్దుర్తి, దుర్గి, మాచర్ల, వినుకొండ, బొల్లాపల్లి, కారంపూడి, గురజాల మండలాల ప్రజలు 40 ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. పాలకులు మాత్రం శంకుస్థాపనలతోనే సరిపెడుతున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే 1.20 లక్షల ఎకరాలకు సాగు నీటితో పాటు తాగునీటి అవసరాలు తీరుతాయి. ఇంతటి ప్రాధాన్యమున్న ప్రాజెక్టుకు 1996 మార్చి 5న అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్దుర్తి మండలం శిరిగిరిపాడులోని వీరస్వామి గుడివద్ద శంకుస్థాపన చేశారు. 2008 జూన్ 6న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖర్‌రెడ్డి వెల్దుర్తి మండలం గంగలకుంట వద్ద శంకుస్థాపన చేశారు. శిలాఫలకాలు దాటి పనులు ప్రారంభించలేదు. తాజాగా సిఎం జగన్మోహన్‌రెడ్డి గతేడాది నవంబర్ 15న మాచర్లలో వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ ప్రాంతంలో 30 ఏళ్ల క్రితం బోరు వేస్తే 30 అడుగల్లోనే నీరు వచ్చేది. ఇప్పుడు 1,300 అడుగులు వేసినా ఫలితం ఉండడం లేదు. వేసవిలో తాగునీటికి జనం అల్లాడుతున్నారు. ప్రతి కుటుంబం నెలకు రూ. వెయ్యి పెట్టి తాగునీరు కొనుక్కోవాల్సి వస్తోంది.

ఉపాధి లేక వలసలు..

ఈ ప్రాంత యువతకుఉపాధి కరువైంది. హైదరాబాద్, తిరుపతి, బెంగుళూరు, విజయవాడ తదితర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. నాగార్జున సాగర్ రిజర్వాయర్‌లో కొండల మధ్య సహజ సిద్ధంగా ఏర్పడిన సాగర్ చీలికలో నిలిచి ఉండే నికర జలాలు, మిగులు జలాలను వజ్రాలపాడు తండా వరకూ నీరు వచ్చే విధంగా పథకాన్ని రూపొందించారు. ప్రాజెక్టు పూర్తయితే 50 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. 225 ఎకరాలున్న వజ్రాలపాడు చెరువు మొదట నిండితే దాని ద్వారా వెల్దుర్తి, దుర్గి, బొల్లాపల్లి, పుల్లలచెరువు మండలాల్లో 60కి పైగా చెరువులు నిండుతాయి. తద్వారా భూగర్భ జలాలు పెరిగి 150 గ్రామాల్లో, తండాల్లో 1.20 లక్షల ఎకరాలు సాగులోకి వస్తుంది. ప్రాజెక్టుకు తొలి విడతగా రూ.1,600 కోట్లు కేటాయించి పనులు ప్రారంభించాలని వరికపూడిశెల ప్రాజెక్టు సాధన సమితి డిమాండ్ చేస్తోంది.

ఉద్యోగాలకు 'మోడల్' విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఒంగోలులోని దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాలో పాల్గొని సత్తా చాటారు. ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో చదువుతున్న బిఎ మూడో సంవత్సరం విద్యార్థి ఆర్. చైతన్య శివ ప్రసాద్, బికాం విద్యార్థి నాగేంద్రబాబు, బిఎ విద్యార్థి రవి కిరణ్ గ్రీన్ టెక్ కంపెనీలో ఉద్యోగాలు సాధించారు. జి.నాగరాజు పేటిఎం, ఎం. నాగరాజు గ్రీన్ టెక్, పెద్ద యాకోబు టెలీ కాలింగ్, బి.నాగేశ్వరరావు జోయలుకాస్, ఎ.శివనాగరాజు ముత్తుట్ ఫైనాల్స్, ఎం.నవీన్ డీమార్ట్, మరియబాబు బ్యాంక్ జోన్, వీరాంజనేయులు రిలయన్స్, ఎం. నరేష్ ఎస్‌బిఐ, బయన్న ముత్తుట్ ఫైనాల్స్ కంపెనీలలో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీధర్ నాయుడు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి ప్రదీప్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

తపాలా సేవలు ప్రజలకు మరింత చేరువ

ప్రజాశక్తి - మార్కాపురం రూరల్

తపాలా సేవలను ప్రజలకు మరింత చేయాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉందని తపాలా శాఖ సర్కిల్ అసిస్టెంట్ డైరెక్టర్ శివ నాగ రాజ్ తెలిపారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో తపాలా శాఖ ఆధ్వర్యంలో డిపార్ట్మెంట్ ఆఫ్ పోస్ట్ అనే కార్యక్రమం మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా శివ నాగరాజ్ మాట్లాడుతూ ప్రతి పోస్టల్ ఉద్యోగి పోస్టల్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం మార్కాపురం డివిజన్ వ్యాప్తంగా తపాలా శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పథకాల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన సిబ్బందికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం డివిజన్ సూపరిండెంట్ శ్రీనివాసరావు, మార్కాపురం ఇన్‌స్పెక్టర్ డి. నాగరాజు, శ్రీనివాసులు ,మహమ్మద్ అలీ, తపాలా శాఖ ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శివనాగరాజు

ఇసిజి తీసున్న వైద్యసిబ్బంది

ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండల పరిధిలోని మద్దిరాల ముప్పాళ్ళ గ్రామంలో ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కిమ్స్ ఆహాస్పిటల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ రఫీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందించాలని ఉద్దేశ్యంతో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 220 మందికి కంటి పరీక్షలు, ఇసిజి, బిపి,షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు అందచేశారు గుండె, కిడ్నీ , పేషంట్లకు తగు జాగ్రత్తలు చెప్పారు. రోగ నిర్ధారణ జరిగిన 30 మంది పేషంట్లకు ఒంగోలు కిమ్స్ హాస్పిటల్‌లో ఆరోగ్యశ్రీ, ఇఎస్ఐ ,ఇహెచ్ఎస్, కార్డులపై ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామాంజ నేయులు ఆప్తమాలజిస్ట్ రాణి ,కిమ్స్ హాస్పిటల్స్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విజేతలను శిద్దా ప్రవళిక

విజేతలకు అభినందనలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

హైదరాబాదులోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఫిబ్రవరి 18న జాతీయ స్థాయి కరాటే కుంఫు ఛాంపియన్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రకాశం జిల్లా తగా గత్ బోధి ధర్మ సిటోరియో కరాటే ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ సంస్థ విద్యార్థులు పాల్గొని కటాస్ విభాగంలో ఏడు బంగారు, ఐదు వెండి పతకాలు సాధించారు.పతకాలు సాధించిన విద్యార్థులను రైస్ కళాశాల (ఉమెన్ ఎంపర్ మెంట్) చీపు అడ్వైజర్ శిద్దా ప్రవళిక మంగళవారం అభినందించారు. డి.విహాస్, ఆఫ్రిది, అబ్దుల్ రజాక్, హేమంత్ మోక్షిత్ సాయి, ఆశ్రిత్, సాయిరాం బంగారు శ్రీనిక,. విమోక్షత్, అభినాష్, భాను, యువరాజు వెండి పతకాలు సాధించారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ వెంకటేష్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రుణాలు రికవరీ చేయాలి

ప్రజాశక్తి- మార్కాపురం రూరల్

గ్రామ స్వయం సహాయక సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను నూరు శాతం రికవరీ చేయాలని డిఆర్‌డిఎ వైకెపి ఎపిఎం రమేష్ బాబు విఓఎలకు సూచించారు. స్థానిక ఎస్సీ, బీసీ కాలనీలోని డ్వాక్రా బజారులో మండల సమాఖ్య కమిటీ, గ్రామ సమాఖ్య కమిటీ సభ్యులు, విఓఎలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఎం రమేష్ బాబు మాట్లాడుతూ గ్రామాలలో స్వయం సహాయక సంఘ సభ్యుల ఆర్థికాభివద్ధికి తోడ్పడాలన్నారు. గ్రామ సంఘాలలో స్త్రీ నిధి, ఉన్నతిలలో సభ్యులు తీసుకున్న రుణాలను 100 శాతం రికవరీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య కమిటీ అధ్యక్షురాలు, ఉపాధ్యక్షురాలు, కోశాధికారి, ఎల్‌బి నాగభూషణం, సిపిలు మనోకుమారి, స్వామి, అకౌంటెంట్ నాగమణి, విఓఎలు, గ్రామ సమాఖ్య కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉమ్మడి ప్రకాశం జిల్లా పురుషుల కబడ్డీ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

పురుషుల కబడ్డీ జట్టు ఎంపిక

ప్రజాశక్తి-శింగరాయకొండ

మండల పరిధిలోని పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి ప్రకాశం జిల్లా పురుషుల కబడ్డీ జట్టు క్రీడాకారుల ఎంపిక మంగళవారం నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డివిఎస్ ప్రసాద్ తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఎంపిక చేసినట్లు జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి సిహెచ్. పుల్లయ్య తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు మార్చి 3 నుంచి 5 వరకూ విశాఖపట్నంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయులు పిల్లి. హజరత్తయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వైస్ సర్పంచి బి. ప్రభాకర్ రెడ్డి, ఎంపిటిసి వై. శ్రీనివాసులు, కె.అంకయ్య ఎస్ఎంసి చైర్మన్ మాధవరావు, వైసిపి నాయకులు కె. కష్ణారెడ్డి ,జి.గోవర్ధన్, వి. తాతయ్య, బుజ్జమ్మ పాల్గొన్నారు.

పురుషుల జట్లుకు ఎంపికైన క్రీడాకారులు..

ఉమ్మడి ప్రకాశం జిల్లా పురుషుల కబడ్డీ ఎంపికైన వారిలో ఎం.తిరుపతిరెడ్డి, ఇ. బ్రహ్మారెడ్డి, ఎం. నరేంద్రరెడ్డి, వై.రాజశేఖర్‌రెడ్డి, యశ్వంత్, పి.సాయి, ఎ.సుబ్బారెడ్డి, పి. బాలకష్ణారెడ్డి,వెంకటేశ్వరరెడ్డి, ఎ.అనిల్‌రెడ్డి, జి.మల్లికార్జున్‌రెడ్డి,తేజ, రామ కష్ణారెడ్డి,. శ్రీనివాస్‌రెడ్డి, బి.వెంకటరమణ ఉన్నారు.

వైసిపిని సాగనంపాలి

మాజీ ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్

ప్రజాశక్తి-చీమకుర్తి

రాష్ట్రంలో అరాచకపాలన సాగిస్తున్న వైసిపిని ఇంటికి సాగనంపాలని టిడిపి సంతనూతలపాడు నియోజక వర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే బిఎన్.విజయ కుమార్ తెలిపారు. స్థానిక ఎన్‌టిఆర్ కాలనీలో బాబు ష్యూరిటీ, భవిషత్తుకు గ్యారెంటీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయకుమార్ ఇంటింటికీ తిరిగి టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అడకాస్వాములు, మన్నం ప్రసాదు, కాట్రగడ్డ రమణయ్య,ఉన్నం సుబ్బారావు, గొల్లపూడి సుబ్బారావు, యడ్లపల్లి రామబ్రహ్మం,.వెంకటరావు పాల్గొన్నారు.

స్థానికులతో మాట్లాడుతున్న విజయకుమార్

పెద్దదోర్నాల : టిడిపితోనే ప్రజల భవిష్యత్ గ్యారెంటీ సాధ్యమని టిడిపి యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు తెలిపారు. మండల పరిధిలోని జమ్మి దోర్నాలలో బాబు షూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు ఇంటింటికీ తిరిగి టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ ఏరువ మల్లికార్జునరెడ్డి, నాయకులు భట్టు సుధాకర్‌రెడ్డి, అంబటి వీరారెడ్డి, షేక్ మాబు, దొడ్డా శేషాద్రి, శ్రీనివాస యాదవ్, ఆదిరెడ్డి, సర్పంచ్ గుండారెడ్డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల్లో అవినీతి

- అధికారులకు ముడుపులు
- అనర్హులకు పట్టాలు

ప్రజాశక్తి-త్రిపురాంతకం

త్రిపురాంతకంలో నిన్నటి వరకూ చేసిన తహశీల్దారు కిరణ్, ప్రస్తుతం విఆర్‌ఒగా పని చేస్తున్న శివలింగయ్య అవినీతికి పాల్పడ్డారు. అసైన్మెంట్ కమిటీలో లక్షల్లో డబ్బులు తీసుకొని ప్రభుత్వ భూములను విశ్రాంత ఉద్యోగులకు ఇప్పించారు. ఈ ఈ విషయంపై మాజీ ఎంపిపి ఆళ్ల ఆంజనేయరెడ్డి మంగళవారం త్రిపురాంతకం వచ్చిన సబ్ కలెక్టర్ రాహుల్ మీనాకు ఫిర్యాదు చేశారు. అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో ప్రభుత్వ భూములను రాహుల్ మీనా పరిశీలించారు. మాజీ ఎంపిపి ఆళ్ల ఆంజనేయరెడ్డి బాల త్రిపుర సుందరి దేవి ఆలయంలో రాహుల్ మీనాకు వినతి పత్రం అందించారు. ఒ ప్రభుత్వ ఉద్యోగికి కుటుంబ సభ్యులకు 10 ఎకరాలు కట్టబెట్టినట్టు ఆరోపించారు. విఆర్‌ఒ శివలింగయ్యపై చర్యలు తీసుకోవాలని రాహుల్ మీనాను కోరారు. అనంతరం రాహుల్ మీనా త్రిపురాంతకం మండలంలోని సర్వే నెంబర్ 294, 295, 297, 298, 300, 804 గల భూములను పరిశీలించారు. అక్కడ సాగులో ఉన్న ఎస్‌టి సామాజిక వర్గానికి చెందినా వారు అయన వద్దకు చేరుకున్నారు. ఎన్నో ఏళ్ళుగా ఈ భూములను తాము సాగు చేసుకున్నట్లు వారు తెలిపారు. కంది, జొన్న, నూగు వంటి పంటలు వేస్తున్నట్లు తెలిపారు. ఈ భూమిని 50 కుటుంబాల వారు దున్నుకోగా 40 కుటుంబాల వారు సాగు చేయడం లేదని తెలిపారు. రాహుల్ మీనా మాట్లాడుతూ భూమిలో సాగులో ఉన్న వారి వివరాలు, భూమి కొరకు దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు తనకు నివేదిక పంపాలని అధికారులను ఆదేశించారు. తప్పక అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు రామకష్ణ శివ ప్రసాద్, సర్వేయర్ గురవయ్య, ఆర్‌ఐ ముకుందహరి, ఎస్‌ఐ సాంబశివయ్య, గ్రామ రెవెన్యూ అధికారులు శివలింగాయ్య, రమ్యకష్ణ, గ్రామ సర్వేయర్లు రైతులు పాల్గొన్నారు.

ఇతరులకు పట్టాలిచ్చిన భూమి

సబ్ కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న నాయకులు

ఎస్‌ఐ ప్రేమ్‌కుమార్‌కు సన్మానం

ప్రజాశక్తి-సిఎస్‌పురం

సిఎస్‌పురం ఎస్ఐ బి.ప్రేమకుమార్‌ను జనసేన నాయకులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఎస్ఐను సన్మానించిన వారిలో జనసేన మండల అధ్యక్షుడు జానాపాటి రాజా, నాయకులు ఊసా శ్రీను, ఉల్లిపాయల సుబ్బారాయుడు, మురళియాదవ్, పోర్ల రాంబాబు, సంగిశెట్టి సాయి ఉన్నారు.

ఓటరు జాబితాపై సమీక్ష

ప్రజాశక్తి-కొండపి

ఓటరు జాబితాను క్రమ పద్ధతిలో చేర్చాలని రాజకీయ పార్టీ నాయకులు ఎన్నికల రిటర్నింగ్ అధికారిని కోరారు. తహశీల్దారు కార్యాలయంలో ఓటరు జాబితాపై అధికారులు, రాజకీయ పార్టీ నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజకీయ నాయకులు మాట్లాడుతూ ఓటరు జాబితాలో ఒకే కుటుంబానికి చెందిన వారి ఓట్లు క్రమ సంఖ్యలోలేవని తెలిపారు. అవి వరుస క్రమంలో ఉండేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా ఇఆర్‌ఒ కుమార్ మాట్లాడుతూ ఈ విషయంపై ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

'మద్దాళి'కి పురస్కారం

ప్రజాశక్తి-చీమకుర్తి

ప్రపంచ మాతృభాషా దినోత్సవం సందర్భంగా ఎల్‌సిఇఎస్ ఫౌండేషన్ హైదరాబాదు వారి ఆధ్వర్యంలో అభయకళారాధన అధ్యక్షుడు మద్దాళి మాధవరావుకు సి.నారాయణరెడ్డి జాతీయ కళారత్న పురస్కారం, కొణిజేటి రొశయ్య జీవన సాఫల్య పురస్కారం అందజేశారు. కరవదిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ నాగరాజు, కొలకలూరి రవిబాబు, లిటిల్‌చాంప్స్ అకాడమీ ప్రతినిధి బుచ్చేశ్వరరావు చేతుల మీదుగా ఈ పురస్కారాలు అందజేశారు.

నేడు 'వాలంటీర్లకు వందనం'

ప్రజాశక్తి-కొమరోలు

స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణం వద్ద వాలం టీర్లకు వందనం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ నరసింహారావు తెలిపారు. ఈ సందర్భంగా వాలంటీర్లకు పుస్కారాలు అందజేసి సన్మానించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వైసిపి గిద్దలూరు నియోజక వర్గ ఇన్‌ఛార్జి, మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి, జడ్‌పిటిసి సారె వెంకట్ నాయుడు, చింతలపల్లి సర్పంచి జనార్దన్ నాయుడు హాజరు కానున్నట్లు తెలిపారు.

దర్శి : దర్శిలోని పిజిఎస్ కాంప్లెక్స్‌లో బుధవారం వాలంటీర్లకు వందనం కార్యక్రమం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ హనుమంతరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైసిపి దర్శి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు.

సార్వత్రిక ఎన్నికలకు సిద్ధం : సిపిఐ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

సార్వత్రిక ఎన్నికల్లో సిపిఐ పోటీకి సిద్ధమని, కాంగ్రెస్, వామపక్షాల పొత్తులో భాగంగా ఇండియా కూటమి ఆధ్వర్యంలో సిపిఐ పోటీ చేస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ మంగళవారం తెలిపారు. స్థానిక కార్యాలయంలో సిపిఐ ముఖ్య కార్యకర్తల సమావేశం టిసి హెచ్. చెన్నయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్. నారాయణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయన్నారు. కేంద్ర,. రాష్ట్ర ప్రభుత్వాలను రాబోయే ఎన్నికల్లో గద్దె దించేందుకు సిపిఐ ఇండియా కూటమికి మద్దతు తెలుపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె నాసరయ్య, నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు కెవి.కష్ణగౌడ్, జివి .గురునాథం, విశ్వరూపాచారి, పూర్ణకంటి తిరుమలయ్య, నయుంబీగ్, గాలి లక్ష్మీరాజ్యం, మన్యం సాంబశివరావు, వై. వెంకట శివయ్య, యోగయ్య, మొగిలి వెంకటేశ్వర్లు, గుంటూరు శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

పంటల సాగుపై రైతులకు శిక్షణ

ప్రజాశక్తి-పెద్దారవీడు

మండల పరిధిలోని పెద్దారవీడు, దేవరాజు గట్టు రైతు భరోసా కేంద్రాల పరిధిలోని రైతు ఉత్పత్తి దారుల సంఘాల రైతులకు పంటల సాగుపై జిల్లా వనరుల కేంద్రం అధికారులు మంగళ వారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎఒ బుజ్జిబాయి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లా వనరుల కేంద్రం, వ్యవసాయ అధికారులు శైలజ, వెంకట శేషమ్మ మాట్లాడుతూ పంటల సాగులో చేపట్టాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులు, విత్తనశుద్ధి, జీవన ఎరువుల వినియోగం, పచ్చి రొట్ట ఎరువులు ప్రాముఖ్యత గురించి రైతులకు వివరించారు. స్థానిక ఎఒ బుజ్జిబాయి మాట్లాడుతూ రైతు ఉత్పత్తి దారు సంఘాల ఏర్పాటు పద్ధతి మరియు ప్రయోజనాలు, ఇతర వ్యవసాయ శాఖ ద్వారా అందుబాటులో వున్న వివిధ పథకాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పెద్దారవీడు, దేవరాజుగట్టు గ్రామాల గ్రామ వ్యవసాయ సహాయకులు ఆదిలక్ష్మి, చిన్న, రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా వనరులకేంద్ర ఎఒ వెంకట శేషమ్మ

క్రీడాకారుల జీవితాలతో వైసిపి చెలగాటం

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి

ప్రజాశక్తి-కనిగిరి

క్రీడాకారులతో వైసిపి ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని మాజీ ఎమ్మెల్యే, టిడిపి కనిగిరి నియోజక వర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పేర్కొన్నారు. ఆడుదాం ఆంధ్రా అంటే క్రీడాకారుల జీవితాలతో చెలగాటమాడటం లా ఉందన్నారు. ఆంధ్రా రంజీ క్రికెట్ జట్టులో 17వ ఆటగాడిగా ఉన్న తిరుపతి వైసిపి కార్పొరేటర్ కుమారుడిని పద్ధతి మార్చుకోవాలని మందలించడమే ఆంధ్రా రంజీ జట్టు కెప్టెన్ హనుమ విహారి చేసిన మహాపరాధమన్నారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ నిందితుడు శరత్ చంద్రారెడ్డిని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నియమించినపుడే ఏపీ పరువు బంగాళాఖాతంలో కలిసిపోయిందన్నారు. తాలిబాన్లను తలదన్నే వైసిపి విధ్వంసక పాలనలో ఇప్పటివరకు పరిశ్రమలు పక్కరాష్ట్రాలకు వెళ్లిపోవడం చూశామని, ఇప్పుడు అంబటిరాయుడు, హనుమ విహారి వంటి కొమ్ములు తిరిగిన క్రీడాకారులు పారిపోతున్నారన్నారు. డ్రస్సింగ్ రూంలో జరిగిన చిన్న విషయంలో విహారి కెప్టెన్సీ బాధ్యతల నుంచి వైదొలిగేలా చేయడం బాధాకరమన్నారు. హనుమ విహారికి మంత్రి రోజా క్షమాపణలు చెప్పి తిరిగి కెప్టెన్సీ ఇచ్చి రాష్ట్ర క్రీడాభివృద్ధికి తోడ్పడాలన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర



మాట్లాడుతున్న కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్

సాంకేతిక సదస్సులతో ప్రయోజనం

ప్రజాశక్తి-టంగుటూరు

సాఫ్ట్ వేర్ రంగంలో ప్రస్తుతం వస్తున్న నూతన సాంకేతికతకు అనుగుణంగా పేస్ కళాశాలలో నిర్వహిస్తున్న సాంకేతిక సదస్సులు విద్యార్థులకు ఎంతగానో ఉపకరిస్తాయని పేస్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ తెలిపారు. పేస్ ఇంజినీరింగ్ కళాశాలలో గత 3 రోజులుగా ఎఐఎంఎల్, మరియు ఎఐడిఎస్ విభాగాల ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సదస్సుకు స్ప్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్, సొసైటీ ఫర్ డేటా సైన్స్ సంస్థ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ సాంకేతిక అవగాహన సదస్సులు క్యాంపస్ ప్లేస్మెంట్స్‌లో ఉద్యోగాలు సాధించేందుకు ఎంతగానో ఉప కరిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జివికె. మూర్తి, ఎఐఎంఎల్, ఎఐటిఎస్ విభాగాధిపతులు, కళాశాల అధ్యాపక బందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరు మండలంలో ఉపాధి హామీ చట్టం కింద 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ 5.50 కోట్ల విలువైన పనులు నిర్వహించారు. ఈ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. పనులు సక్రమంగా నిర్వహించకుండానే బిల్లులు చేశారని,గ్రామాలలోనే లేని వారిని ఉపాధి కూలీలుగా నమోదు చేసి క్షేత్రస్థాయి సిబ్బంది మండల స్థాయి అధికారులకు కూడా తెలియకుండానే నిధులు దోచుకున్నట్లు విమర్శలు వెల్లువెత్తాయి. సామాజిక తనిఖీ బృందం నివేదికను చదివి మమ అనిపించడం విమర్శలకు దారితీసింది. అవినీతే జరగలేదని తేల్చడంపై ప్రజాప్రతినిధులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలం మొత్తం మీద కేవలం రూ.50 వేల లోపే అవినీతి జరిగినట్లు సామాజిక తనిఖీ ప్రజావేదికలు నిర్ధారణకు రావడం, ఆ నిధులపై రికవరీకి ఆదేశించడం గమనార్హం. ఈ కార్యక్రమంలో ఎంపిపి పటవపంజుల కోటేశ్వరమ్మ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శీనారెడ్డి, జిల్లా విజిలెన్స్ అధికారి రూస్సీ, సామాజిక తనిఖీ ఎస్‌ఆర్‌పి సుబ్బారావు, ఏపీడీ వెంకటస్వామి, ఎంపిడిఒ సుబ్రహ్మణ్యం, ఎపిఒ సుభాషిణి, ప్రజాప్రతినిధులు, ఉపాధి హామీ పథకం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సామాజిక ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు

'ఆన్‌లైన్ బ్యాంకింగ్'పై అప్రమత్తత

లీడ్ బ్యాంకు మేనేజర్ శివకృష్ణ

ప్రజాశక్తి-బాపట్ల

ఆన్‌లైన్ బ్యాంకింగ్ వ్యవస్థ ద్వారా జరిగే ఆర్థిక లావాదేవీలు పట్ల బ్యాంకు ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని లీడ్ బ్యాంకు మేనేజరు కె శివకృష్ణ అన్నారు. మంగళవారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంక్ సౌజన్యంతో అసోసియేషన్ ఫర్ వెల్ఫేర్ యాక్టివ్ రూరల్ డెవలప్‌మెంట్ (అవార్డు) స్వచ్ఛంద సేవా సంస్థ పట్టణంలో పటేల్ నగర్‌లో ఏర్పాటు చేసిన ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ బ్యాంకింగ్, సైబర్ నేరాలపట్ల అప్రమత్తత, ఇన్సూరెన్స్ స్కీములు, పెన్షన్ స్కీం, వంటి ఆర్థిక లావాదేవీలపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకింగ్ సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సంస్థ ప్రధాన ప్రతినిధి ఎం రమణయ్య మాట్లాడుతూ బాపట్ల రూరల్, కర్లపాలెం, కారంచేడు మండలాల గ్రామ స్థాయిలో బ్యాంకింగ్ సేవలు, బ్యాంకింగ్ వ్యవస్థ అందించే ప్రత్యేక పథకాల పట్ల అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఆయా మండలాల ప్రజలు ఆర్థిక అక్షరాస్యత కేంద్రాల సేవలు వినియోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆర్థిక అక్షరాస్యత గోడ ప్రతులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బాపట్ల యూనియన్ బ్యాంక్ మేనేజర్ ఎన్ సురేష్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ ఇమ్రాన్ మహమ్మద్, కెనరా బ్యాంకు మేనేజర్ జితేంద్ర, బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ రవీంద్ర, అవార్డు సంస్థ కోఆర్డినేటర్ రాజశేఖర్, పొన్నూరు, రేపల్లె, అమృతలూరు, పర్చూరు సిఎఫ్ఎల్ కేంద్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

గోడప్రతులను ఆవిష్కరిస్తున్న బ్యాంక్ అధికారులు

విద్యార్థుల్లో ఆర్థిక అక్షరాస్యత అవసరం

మానవ మనుగడకు ఆర్థిక వనరులు అత్యంత అవసరమని లీడ్ బ్యాంక్ మేనేజర్ కొప్పోలు శివకృష్ణ విద్యార్థులకు సూచించారు. మంగళవారం ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు-2024 సందర్భంగా బాపట్ల ఉన్నత పాఠశాల 8, 9వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల ప్రారంభ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. విద్యార్థి దశ నుంచే బాలబాలికలు ఖర్చులు అదుపు చేసి పొదుపు పాటించేలా నేర్పిస్తే వారు భవిష్యత్తులో ఆర్థిక సమస్యలను అధిగమిస్తారని చెప్పారు. అరవై మంది విద్యార్థులు పాల్గొన్న వ్యాసరచన పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందిన విద్యార్థులకు నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ బాపట్ల శాఖ మేనేజర్ ఎన్ సురేష్ బాబు, జిల్లా సైన్స్ అధికారి ఎండి సాదిక్, పాఠశాల హెచ్ఎం బి రాజశ్రీ పాల్గొన్నారు.

రైతుల ధర్నాలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-వేమూరు

దుగ్గిరాలలో శుభం మహేశ్వరి స్మాల్ స్టోరేజీలో జరిగిన అగ్నిప్రమాదంలో పసుపును నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ మార్చి 1వ తేదీ నుంచి దుగ్గిరాల మండల తహశీల్దారు కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షులు వేములపల్లి వెంకట రామయ్య విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ సంఘటన జరిగి సుమారు 38 రోజులు పూర్తవుతున్నప్పటికీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. ఈ ధర్నాల్లో వేమూరు నియోజకవర్గంలోని భట్టిప్రోలు, కొల్లూరు, వేమూరు మండలాల రైతులతోపాటు ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఆయా మండలాల్లో పసుపును నష్టపోయిన రైతులు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి-అద్దంకి

స్థానిక గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి శాఖ, సీడాప్ వారి సంయుక్త ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు ప్రముఖ కంపెనీలైన, హెటెరో ల్యాబ్స్ లిమిటెడ్, కృష్ణ పట్నం పోర్ట్, గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్, బ్యాంకు ఆఫ్ బరోడా, ఐసీఐసీఐ బ్యాంక్, డెకిన్, జియో, ఆక్సిస్ బ్యాంక్, జోయలుకాస్ వంటి 22 కంపెనీలు పాల్గొనగా 950 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరయ్యారు. 22 కంపెనీ ప్రతినిధులు 187 మంది అభ్యర్థులను సెలక్ట్ చేసుకున్నామని, 92 మందిని చివరి రౌండ్ కోసం ఎంపిక చేశామని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి తమ్మాజీరావు తెలియజేశారు. నిరుద్యోగ యువతకు ఇది సువర్ణ అవకాశమని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైసిపి అద్దంకి నియోజకవర్గం నాయకులు పానెం శ్రీనివాసరెడ్డి, అద్దంకి మున్సిపల్ వైస్ చైర్మన్ దేసు పద్మేష్, అద్దంకి ఎంపిడిఓ జివి సత్యనారాయణ, మెప్మా సిఎం ఎం పణికుమారి, ఏఎంసి వైస్ చైర్మన్ మాకినేని శ్రీనివాస్, సాహితీ అకాడమీ స్టేట్ డైరెక్టర్ కొల్లా భవనేశ్వరి, షేక్ బాజీవాలి ఉర్దూ అకాడమీ డైరెక్టర్, షేక్ బాజీవాలి ఉర్దూ అకాడమీ డైరెక్టర్, యంగ్ ప్రొఫెషనల్ హరిక సౌగంధి, ప్లేస్మెంట్ ఆఫీసర్ బి శ్రీనివాస్, గోపి మరియు స్కిల్ డెవలప్మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

29న జాబ్ మేళా

చీరాల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 29న ఈపురుపాలెం ఐటిఐ కళాశాలలో మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నారని కళాశాల ప్రిన్సిపల్ ఎస్‌పి సత్తార్ ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్ మేళాలో ఐసిఐసిఐ బ్యాంక్, హీరో మోటార్, స్కిల్ సోనిక్స్ కంపెనీలు హాజరవుతాయని తెలిపారు. జాబ్ మేళాకు ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ చదువుకున్న 18 నుంచి 20 సంవత్సరాల వయసుగల వారు తమ ఎడ్యుకేషన్ సర్టిఫికెట్, ఆధార్, పాస్‌పోర్టు సైజ్ ఫొటో తీసుకొని హాజరు కావాలని అన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. వివరాలకు 7981443777 నంబరులో సంప్రదించాలన్నారు.



కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి వస్తున్న విఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కాలేజీ సిబ్బంది

అధ్యాపకుల జీతాలు గోల్‌మాల్

ప్రజాశక్తి-చీరాల

చీరాల విఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ విద్యా సంస్థల్లో పనిచేసిన సుమారు 30మంది సిబ్బందికి 22 నెలల వేతనాలు ఇవ్వలేదని ఆయిల్స్ అండ్ ఫాట్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ షబీనా తెలిపారు. తాను 2011 నుంచి కళాశాలలో పనిచేసినట్లు చెప్పారు. తనతోపాటు 30మంది బోధన, బోధనేతర సిబ్బంది ఉన్నట్లు చెప్పారు. 2019 అక్టోబర్ నుంచి 2021 అక్టోబర్ వరకు మధ్యలో రెండు నెలలు పోను 22 రెండు నెలలకు వేతనాలు ఇవ్వాల్సి ఉందని అన్నారు. జగనన్న విద్యాదీవెన ఫీజు రీఎంబర్స్‌మెంట్ వస్తే ఇస్తామని కాలం గడిపారని చెప్పారు. ఆ తర్వాత కూడా వేతనాలు ఇవ్వకపోవడంతో అక్కడ మానేసినట్లు తెలిపారు. తమకు రావలసిన వేతనాల కోసం కాలేజీ సెక్రటరీ అద్దగడ వేణుగోపాల్, ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. 2021 నవంబర్ నుంచి యలమంచిలి గ్రూపునకు కాలేజీ నిర్వహణ అప్పజెప్పారు. ఆ తర్వాత యలమంచిలి రామకృష్ణను తమ వేతనాలు కోరినట్లు తెలిపారు. కాలేజీలో ఏ అకౌంట్‌లో ఉన్నాయో తెలియదని, తాము బాధ్యత తీసుకోకముందు పనిచేసిన రోజుల వేతనాలు తమకు ఏమీ సంబంధం లేదని చెప్పారన్నారు. దీంతో రెండేళ్లుగా వేతనాల కోసం తిరిగినట్లు తెలిపారు. విసిగిపోయి చివరికి కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

వేగేశన సమక్షంలో టిడిపిలో చేరిన వైసిపి నాయకులు, కార్యకర్తలు

వైసీపీ నుంచి టిడిపిలోకి చేరికలు

ప్రజాశక్తి-బాపట్ల: బాపట్ల నియోజకవర్గంలో వైసీపీ నుంచి టిడిపిలోకి చేరికలు పెరిగాయి. మంగళవారం పిట్టలవానిపాలెం మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఎండి అఫ్జల్, గ్రామ పార్టీ అధ్యక్షుడు రజాక్, ఫ్రెడ్రిక్, సాగర్, బెజ్జం రమేష్ ఆధ్వర్యంలో కత్తివారిపాలెం హరిజనవాడకు చెందిన 40మంది, చందోలుకు చెందిన మరో 30 బాపట్ల నియోజకవర్గ టిడిపి, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వైసిపి అరాచక పాలన నచ్చక టిడిపిలో చేరినట్లు పార్టీలో చేరిన నాయకులు తెలిపారు. కార్యక్రమంలో వెంకటపతి రాజు, శ్రీధర్ వర్మ, సాంబమూర్తి రాజు, సోహెల్, జునేద్, చందాని, బాజీ, సౌపాటి గ్లోరీ పాల్గొన్నారు.

ర్యాంకులు సాధించిన విద్యార్థులతో అధికారులు, ఉపాధ్యాయులు

ఐఐటిలో శిక్షణ అభినందనీయం

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్: చిన్ననాటి నుంచే ఐఐటిలో శిక్షణ అభినందనీయమని ఎస్‌బిఐ డిప్యూటీ మేనేజర్ జయలక్ష్మి అన్నారు. ఇంకొల్లు ఆదర్శ హైస్కూలు ఆవరణలో ఐఐటి పాఠశాల స్థాయిలో జరిగిన అభినందనసభలో జయలక్ష్మి ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఐఐటి మాథ్స్, ఒలీవర్స్ ఐఐటిలో మొదటి 3 ర్యాంకులు సాధించిన 6 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు బహుమతి ప్రదానం జరిగింది. కస్టమర్ అకౌంట్స్ ఆఫ్ ఎస్‌బిఐ విజయ్ కుమార్ ర్యాంకులు సాధించిన వారికి అభినందించారు. చిన్ననాటి నుంచే పోటీతత్వాన్ని అలవర చటం అభినందనీయమన్నారు. బ్యాంకింగ్ రంగంలో ఉన్న అవకాశాలను వివరించారు. విద్యార్థులు పొదుపు చేసుకో వటం అలవరచుకోవాలని విజయకుమార్ సూచించారు. సభకు పాఠశాల కరస్పాండెంట్ తోటకూర విజయభాస్కర్ అధ్యక్షత వహించారు. అనంతరం అతిథులను పాఠశాల పక్షాన సత్కరించారు.

కోనేటిపురంలో తాగునీటికి కటకట

ప్రజాశక్తి-భట్టిప్రోలు

మండలంలోని కోనేటిపురం గ్రామంలో వేసవికాలం పూర్తిగా సమీపించక ముందే తాగునీటి ఎద్దడి ఏర్పడింది. గత ఆయిదారు రోజులుగా పంచాయతీ ద్వారా సరఫరా అయ్యే తాగునీరు సక్రమంగా అందకపోవటంతో గ్రామస్తులు గ్రామ వెలుపల ఉన్న చేతిపంపు నుంచి పనులు మానుకొని మరీ నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. తాగునీటి ఎద్దడి సమస్య అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ పట్టించుకోవటం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా గ్రామంలో ఉన్న జగనన్న కాలనీకి లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన పైప్‌లైన్ కూడా సక్రమంగా పనిచేయకపోవడంతో కాలనీలో తాగునీరు అందడం లేదని చెబుతున్నారు. పైప్ లైన్ నిర్మాణం పూర్తికాకుండానే నాయకులు ముందుగానే బిల్లులు పొందినట్లుగా కూడా ఆరోపణలు వినవస్తున్నాయి. దీని కారణంగానే కాలనీకి సకాలంలో తాగునీరు అందటం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారు లు చర్యలు చేపట్టి గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చేతి పంపు వద్ద సైకిల్‌తో నీటిని తరలిస్తున్న గ్రామస్తులు

నేడు దర్జీ దినోత్సవం

ప్రజాశక్తి-అద్దంకి: అద్దంకి పట్టణంలోని పోస్ట్ ఆఫీస్ వద్ద గల షాదీఖానా(ముస్లిం)లో ది అద్దంకి టౌన్, మండల టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దర్జీ దినోత్సవం జరుగుతుందని టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గోరంట్ల అచ్చయ్య తెలిపారు. ప్రసన్నాంజనేయ స్వామి కాంప్లెక్స్‌లో ఉదయం 9:30 గంటలకు జెండా ఆవిష్కరణ కార్యక్రమం అనంతరం షాదీఖానాలో సమావేశం జరుగుతుందని తెలిపారు. పట్టణ, మండలంలోని టైలర్స్ అందరూ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఉచిత విద్యకు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి-వేమూరు

ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్య పొందటానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ ఒకటో తరగతి నుంచి పాఠశాలలో ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వ విద్యాశాఖ అనుమతినిచ్చిందని 23-2-24 నుంచి మార్చి 14వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. దరఖాస్తుదారులు తమ పిల్లల ఆధారు కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ, రేషన్ కార్డు, ఫోటోలతో సమీపంలోని సచివాలయం లేదా నెట్ సెంటర్, మండల విద్యాశాఖ అధికారి వారి కార్యాలయం ద్వారా దరఖాస్తు చేసుకోవలసి ఉందన్నారు. టోల్ ఫ్రీ నెంబర్ 18004258599ను సంప్రదించవచ్చునన్నారు. గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల్లో 25 సీట్లు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అనాథలు, విభిన్న ప్రతిభావంతులు, హెచ్ఐవి బాధిత పిల్లలకు కేటాయించామన్నారు. స్టేట్ సిలబస్, సీబీఎస్ఈ, ఐబీసీ బోధించే తమ సమీపంలోని పాఠశాలల్లో ప్రవేశం పొందేందుకు అవకాశం ఉందన్నారు.

సిఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-అద్దంకి

ఈ నెల మూడున కోరిశపాడు మండలం, పిచ్చికలగుడిపాడులో జరగనున్న సిద్ధం సభకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హాజరు కానున్న నేపథ్యంలో సభా ప్రాంగణాన్ని, హెలీప్యాడ్ ఏర్పాటు చేసే స్థలాన్ని, పార్కింగ్ ప్రదేశాలను ఎస్పీ వకుల్‌జిందాల్ ఐపిఎస్, సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం మంగళవారం పరిశీలించారు. అధి కారులకు పలు సూచనలు చేశారు. వాహన పార్కింగ్ సమస్యలు తలెత్తకుండా జాతీయ రహదారికి ఇరువైపులా తగిన పార్కింగ్ ప్రదేశా లను సిద్ధం చేయించాలన్నారు. వాహనాలు పార్కింగ్ ప్రదేశాలలోకి సులువుగా వెళ్లడానికి తగిన ర్యాంప్‌లు ఏర్పాటు చేయాలన్నారు. జాతీయ రహదారిపై వచ్చే వాహనాలను దారి మళ్లించే ప్రదేశాలను గుర్తించి రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని ఎస్పీ పోలీస్ అధికారులకు సూచించారు. ఎస్పి మాట్లాడుతూ పిచ్చికల గుడిపాడు గ్రామ పరిధిలోని సుమారు 100 ఎకరాలలో సిద్ధం సభ జరగనుందన్నారు. సిద్ధం సభకు సిఎం జగన్ హాజరు కానున్న నేపథ్యంలో సుమారు 10 లక్షల మందికి పైగా ప్రజలు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నామన్నారు. దానికి అనుగుణంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తూ తగిన భద్రతా చర్యలను తీసుకుంటున్నామన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా వాహనాల దారి మళ్లింపునకు తగిన చర్యలు తీసుకుంటున్నామ న్నారు. సభా ప్రాంగణాన్ని, హెలీప్యాడ్ ఏర్పాటు చేసే స్థలాన్ని, పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ పి.మహేష్, చీరాల డీఎస్పీ ఎస్.ప్రసాద్‌రావు, రేపల్లె డీఎస్పీ టి.మురళీకష్ణ, బాపట్ల డీఎస్పీ సిహెచ్.మురళీకష్ణ, డీఎస్పీ క్రైమ్ సిహెచ్.శ్రీనివాసరావు, ఎ.ఆర్ డిఎస్‌పి ఎస్.చంద్రమోహన్, ట్రైనీ డీఎస్పీ విద్యశ్రీ, ఎస్.బి ఇన్స్పెక్టర్ వి.మల్లికార్జునరావు, అద్దంకి రూరల్ సీఐ ఎ.శివరామకష్ణారెడ్డి, అద్దంకి టౌన్ సిఐ పి.కష్ణయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జివి.కొండారెడ్డి

కార్మిక పోరాటాలకు రాజకీయ అవగాహన అవసరం

ప్రజాశక్తి మార్కాపురం రూరల్

కార్మిక వర్గం తమ హక్కుల సాధన కోసం పోరాటాలు నిర్వహించాలంటే రాజకీయ అవగాహన అవసరమని సిఐటియు జిల్లా కార్యదర్శి జివి.కొండారెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయలో సిఐటియు పట్టణ అధ్యక్షులు బి.సుబ్బరాయుడు అధ్యక్షతన జరిగిన సిఐటియు కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తెలుసుకోవడం కోసం కార్మిక వర్గానికి రాజకీయాలు తెలుసుకోవడం అవసరమన్నారు. మార్చి 17, 18 తేదీల్లో కార్మిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు గుమ్మా బాలనాగయ్య, ప్రభావతి, లక్ష్మీదేవి, చైతన్య, రంగమ్మ, మరియమ్మ, జే నాగరాజు, రాములు పాల్గొన్నారు.

వైసిపి నేతల పరామర్శ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

పుల్లలచెరువు మండలంలోని మర్రి వేములలో మిర్చి కూలీల ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడి పలువురు తీవ్రగాయాలైన సంఘటన తెలిసిందే. క్షతగాత్రులు వినుకొండ కొమ్మినేని మాధవరావు వైద్యశాలలో చికిత్స పొందు తున్నారు. వీరిని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మర్రివేముల వైసీపీ నాయకుడు ఎల్లారెడ్డి రోశి రెడ్డి మంగళవారం పరామర్శించారు.

వైసీపీని వీడి టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

కండువాలు కప్పి.. టిడిపిలోకి ఆహ్వానిస్తున్న ఎరిక్షన్‌బాబు

పెద్దదోర్నాలలోని పోలీస్ స్టేషన్ సమీపంలో గల 22 మైనార్టీ, బీసీ కుటుంబాలు మంగళవారం టిడిపి యర్ర గొండపాలెం నియోజకవర్గ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు సమక్షంలో వైసిపిని వీడి టిడిపిలో చేరారు. ఈ సంధర్భంగా వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించి పార్టీ కండువ కప్పారు. టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఏరువ మల్లికార్జునరెడ్డి, షేక్ మాబుతో పాటు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రాధాన్యతాంశాలపై

అధికారులు శ్రద్ధ పెట్టాలి: కలెక్టర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రభుత్వ ప్రాధాన్యతాంశాలపై అధి కారులు ప్రత్యేక దష్టి పెట్టాలని, వాటిని పూర్తి చేసేందుకు వ్యక్తిగత శ్రద్ధతో పనిచేయాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్ నుండి జిల్లాలోని ఆర్‌డిఓలు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపీడీవోలతో ప్రభుత్వ ప్రాధాన్యతాంశాలైన కన్వేనియన్స్ డీడ్స్, రిజిస్ట్రేషన్స్, హౌసింగ్, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, గ్రామ సచివాలయాలు, ఆర్‌బికెలు, హెల్త్ సెంటర్ల నిర్మాణం తదితరాలపై జాయింట్ కలెక్టర్ చామకూరి శ్రీధర్ తో కలిసి జిల్లా కలెక్టర్ వీక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కన్వేనియన్స్ డీడ్స్‌ను వెంటనే ప్రజలకు అందించాలన్నారు. అదేవిధంగా రిజిస్ట్రేషన్స్ చేయించే ప్రక్రియను మండల స్థాయి అధికారులు ఇతర అధికారులతో సమన్వయం చేసుకొని పూర్తిచేయటానికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయమై ఆర్‌డిఓలు ప్రత్యేక దష్టి పెట్టాలన్నారు. ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేసేందుకు యంపిడిఓలు ప్రణాళికాబద్ధంగా, రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకొని తదనుగుణంగా పూర్తి చేయటానికి కషి చేయాలన్నారు. గహ నిర్మాణానికి సంబంధించి వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలను తరువాతి దశకు తీసుకువెళ్లేందుకు సంబంధిత అధికారులు కషి చేయాలని, నిర్ణీత సమయంలో పూర్తి చేయుటలో నిర్లక్ష్యం వహించే సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లపై క్రమశిక్షణ చర్యలకు కూడా వెనుకాడేది లేదన్నారు. ఇప్పటికే నిర్మాణాలు పూర్తయినటువంటి గ్రామ సచివాలయ బిల్డింగులు, ఆర్‌బికేలు, హెల్త్ క్లినిక్స్‌ను సంబంధిత ప్రజా ప్రతి నిధులతో చర్చించి ప్రారంభించటానికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో హౌసింగ్ పీడీ ప్రసాద్, డ్వామా పిడి అర్జున్, డిఆర్‌డిఏ పిడి కష్ణ, పంచాయతీరాజ్ ఎస్ఇ హరిరామకృష్ణ, జిల్లా వైద్యాధికారి విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

ఎస్‌పి పరమేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం

మాట్లాడుతున్న ఎస్‌పి పరమేశ్వరరెడ్డి

వచ్చే సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కృషి చేయాలని పోలీస్ అధికారులకు ఎస్‌పి పి.పరమేశ్వరరెడ్డి సూచించారు. స్థానిక పోలీస్ సబ్‌డివిజన్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం డివిజన్‌లోని పోలీస్ అధికారుల తో సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఎస్‌పి పరమేశ్వరరెడ్డి మాట్లాడారు. ఎన్నికల నేపథ్యంలో ప్రతి గ్రామంలో పోలీస్ శాఖ నిఘా ఉండాలన్నారు. ఎన్నికల్లో అసాం ఘిక శక్తులపై నిరంతరం నిఘా ఉంచా లన్నారు. ఏ గ్రామంలో ఎప్పుడూ ఎలాంటి ఘటన జరుగుతుందోనని అప్రమత్తంగా ఉండాలన్నారు. రాజకీయ నేతలు, ప్రజలతో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ఎలాంటి గొడవలు జరగకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఈ ప్రాంత సమస్యలు, ఎలాంటి గొడవలు జరుగుతాయో పసిగట్టి పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు పోలీసులతో పాటు జర్నలిస్టులు సహకారం అందించాలని కోరారు. సమీక్షలో డిఎస్‌పి ఎం.బాలసురందరరావు, మార్కాపురం సిఐ ఆవుల వెంకటేశ్వర్లు, యర్రగొండపాలెం సిఐ రాములు నాయక్, గిద్దలూరు సిఐ వీరసోమయ్య, డివిజన్‌లోని అన్ని పోలీస్ స్టేషన్‌ల ఎస్ఐలు పాల్గొన్నారు.

ఇళ్లస్థలాలకు రిజిస్ట్రేషన్ కష్టాలు

- నగరంలో ఇంకా రిజిస్ట్రేషన్ చేయాల్సిన లబ్ధిదారులు 7 వేల మంది..
- సర్వర్ రాక, విఆర్‌ఒలు అందుబాటులో లేక లబ్ధిదారుల పడిగాపులు
- రిజిస్ట్రేషన్ పోర్టల్‌లో పేరు రాకపోవడంతో పలువురిలో ఆందోళన

25వ డివిజన్ సచివాలయంలో లబ్ధిదారుల పడిగాపులు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగరంలో ఇళ్లస్థలాల లబ్ధిదారు లకు రిజిస్ట్రేషన్ కష్టాలు కొనసాగుతున్నాయి. ఓ వైపు సర్వర్ సమస్య, మరో వైపు విఆర్‌ఒలు సచివాలయాలకు సరిపడా లేకపోవడంతో లబ్ధిదారులు సచివాలయాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ప్రజల ఇబ్బందులు పట్టించుకోవా ల్సిన నగరపాలక సంస్థ, రెవెన్యూ అధికారులు పట్టిపట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

రిజిస్ట్రేషన్ కావాల్సినవి 7 వేలు..

నవరత్నాలు..పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ఒంగోలు నగరంలో 20,840 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ఈ నెల 23న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్‌ల పక్రియ ఇంకా పూర్తికాలేదు. 20,840 మంది లబ్ధిదారులకు గానూ సోమవారం నాటికి 13,829 మందికి మాత్రమే రిజిస్ట్రేషన్లు పూర్తి చేశారు. ఇంకా 7,011 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్లు చేయాల్సి ఉంది.

అందుబాటులో లేని విఆర్‌ఓలు..

ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ చేయాలంటే విఆర్‌ఓ తంబ్ తప్పనిసరి. నగరంలో 70 సచివాలయాలు ఉన్నాయి. అన్ని సచివాల యాలలో రిజిస్ట్రేషన్‌లు ప్రారంభించారు. ముఖ్యమంత్రి కార్యక్రమానికి ముందు పక్క మండలాల నుంచి విఆర్‌ఒలను రప్పించి అన్ని సచివాలయాలలో డ్యూటీలు వేశారు. సిఎం కార్యక్రమం తరువాత వారిని రిలీవ్ చేశారు. దీంతో ప్రస్తుతం 28 మంది విఆర్‌ఒలు మాత్రమే ఒంగోలు నగరంలో జరుగుతున్న రిజిస్ట్రేషన్‌ల పక్రియకు అందుబాటులో ఉన్నారు. 70 సచివాలయాలలో ఏ ఒక్క సచివాలయంలో కూడా 100 శాతం రిజిస్ట్రేషన్‌లు ఇప్పటివరకు పూర్తి కాలేదు. 28 మంది విఆర్‌ఓలు మాత్రమే అందుబాటులో ఉండటంతో రిజిస్ట్రేషన్‌ల కార్యక్రమం ఆలస్యం అవుతోంది. మరోవైపు ఆన్‌లైన్ సర్వర్ కూడా ఆలస్యంగా వస్తుండటంతో ప్రజలు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అన్ని అర్హతలు ఉన్నా ఆటంకాలు..

ఇంటిస్థల లబ్ధిదారుల జాబితాలో పేరున్నా రిజిస్ట్రేషన్ చేసేందుకు ఆన్‌లైన్‌లో కొంతమంది పేర్లు కనిపించకపోవడంతో పలువురు లబ్ధి దారులు ఆందోళన చెందుతున్నారు. నగరంలో అర్హులైన ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు గత మున్సిపల్ ఎన్నికలకు ముందు ఇంటి స్థలాలు ఇచ్చేందుకు భరోసా పత్రాలు ఇచ్చారు. తరు వాత అర్హుల జాబితాలో ఇప్పుడు వారి పేర్లను చూపించారు. తాజాగా కార్పొరేషన్ అధి కారులు తీసిన లాటరీలో వారి పేర్లు కూడా వచ్చాయి. ఇంటి స్థలం కేటాయించడానికి ఎంపిక చేసిన సర్వే నెంబర్, లే అవుట్ ఐడి, ప్లాట్ నెంబర్‌తో సహా కేటాయించినా సరే కొంతమందికి రిజిస్ట్రేషన్ పోర్టల్‌లో పేరు కని పించడం లేదు. ఇందుకు కారణాలు ఏంటని లబ్ధిదారులు సచివాలయ అధికారులను ప్రశ్ని స్తున్నారు. వారు రెవెన్యూ, కార్పొరేషన్ కార్యా లయాల పేర్లు చెబుతున్నారు. దీంతో అన్ని అర్హతలు ఉన్నా తమ పేరుమీద పట్టా రిజిస్ట్రేషన్ చేసేందుకు ఎంపిక కాకపోవడంతో పలువురు లబ్ధిదారులు హైరానా పడుతు న్నారు. తమ సమస్య గురించి ఎవరిని సంప్ర దించాలో తెలియక ఆవేదన చెందుతున్నారు. ఇందుకు గల కారణాలను కార్పొరేషన్ కార్యాల యంలో ఆరా తీయగా సిసిఎల్‌ఏ కార్యాలయం నుంచి రిజిస్ట్రేషన్ జాబితాలోకి ఇంకా కొన్ని పేర్లు రావాల్సి ఉందని సిబ్బంది చెబుతున్నారు.

విద్యార్థులు జ్ఞానాన్ని వృద్ధి చేసుకోవాలి

ఆంధ్రకేసరి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ అంజిరెడ్డి

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

నృత్యం చేస్తున్న విద్యార్థినులు

విద్యార్థులు జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవడం ద్వారా భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదుగుతారని ఆంధ్రకేసరి యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ మారెడ్డి అంజిరెడ్డి అన్నారు. స్థానిక మంగమూరు రోడ్డు జంక్షన్‌లో ఉన్న నాగార్జున విద్యాసంస్థలో భాగమైన శ్రీ నాగార్జున డిగ్రీ కళాశాల 24వ వార్షికోత్సవం మంగళవారం ఎ1 ఫంక్షన్ హాలులో జరిగింది. కార్యక్రమంలో అంజిరెడ్డి ముఖ్యఅతిథిగా మాట్లాడారు. విద్యార్థులు విద్యతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు. మరో ముఖ్యఅతిథి ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ జీవన్ చిడితోటి మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని అందుకు అనుగుణంగా కోర్సులను ఎంపిక చేసుకోవాలని సూచించారు. రూట్‌మ్యాప్‌ను ముందస్తుగా సిద్ధం చేసుకుంటేనే ప్రస్తుతం ఉన్న పోటీ ప్రపంచంలో విజయం సాధిస్తారని చెప్పారు. నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ వి రాంప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులందరూ కాలేజీలో జరిగే సిఆర్‌టి ప్రోగ్రాంను వినియోగించుకొని కాలేజీలో జరుగుతున్న ప్లేస్‌మెంట్ ప్రోగ్రాంలో పాల్గొని మంచి ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. తమ కాలేజిలో చదివే విద్యార్థులు డిగ్రీ పూర్తి అయిన తరువాత డిగ్రీ సర్టిఫికేట్‌తో పాటు జాబ్ ఆఫర్‌ను కూడా తీసుకొని బయటకు వెళ్లాలనే లక్ష్యంతో ప్లాన్ తయారుచేసి అమలు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో కాలేజి ప్రిన్సిపల్ సి.వసంతలక్ష్మి, ఆర్.యోగయ్యచౌదరి పాల్గొన్నారు. వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. 0